

చంద్రబాబు అంటేనే సంక్షేమం..
అభివృద్ధి అంటేనే కూటమి
ప్రభుత్వం. సూపర్ సిక్స్ పథకాల
అమలుతో పాటు డీఎస్సీ, పోలీసు
ఉద్యోగాల భర్తీ చేపట్టి ఉపాధి
అవకాశాలు పెంచుతున్నారు.
దేశంలోని 29 రాష్ట్రాలకు
ఆంధ్రప్రదేశ్ దిక్సూచిగా నిలుస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

బుధవారం 26.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 126 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# వెలిగొండ జలసిరులతో అభివృద్ధికి రెక్కలు




- 30 ఏళ్ల క్రితం తీసుకున్న సంకల్పం సాకారం..
- 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం
- ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మూడు దశాబ్దాల క్రితం తీసుకున్న సంకల్పం నేడు సాకారమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ఈ నెల 31న ప్రారంభించనున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా 1996 మార్చి 5న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఫొటోను జత చేస్తూ తన భావాలను పంచుకున్నారు. ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, సవాళ్లను అధిగమించి భగీరథ ప్రయత్నంతో వెలిగొండ ఫేజ్-1ను పూర్తి చేసి కరువు ప్రాంతానికి కృష్ణా జలాలను అందించబోతున్నామని పేర్కొన్నారు. ఈ నెల 31న మార్కాపురం వేదికగా 10.7 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఫేజ్-1 ద్వారా 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్-2 ద్వారా 3.283 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు లక్షలాది మందికి తాగునీరు అందించడమే లక్ష్యమని చెప్పారు. వెలిగొండ జలసిరులు పశ్చిమ ప్రకాశం అభివృద్ధికి రెక్కలు తొడుగుతాయని, కరువుతో పోరాడుతున్న ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయని అన్నారు.

పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కల అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసి వారి ఆకాంక్షను నెరవేర్చామని చంద్రబాబు తెలిపారు. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌లుగా అభివృద్ధి చేసేందుకు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో త్వరలో పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. నేషనల్ హైవేలు, పోర్టుల అనుసంధానంతో ఈ ప్రాంతంలో లాజిస్టిక్స్ సౌకర్యాలను మెరుగుపరుస్తామని, బెంగళూరు-అమరావతి హైవే, రామాయపట్నం పోర్టు ద్వారా వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించి మిగతా



# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

- భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట
- 10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా
- 181 కొత్త ఘాట్ల నిర్మాణంతో సహా 440 ఘాట్ల అభివృద్ధి
- మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు
- గోదావరి పుష్కరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రకృతి ఆరాధన-ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు. పుష్కరాలు కేవలం ప్రభుత్వం నిర్వహించడమే కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. మిగతా 2లో...






# పవన విద్యుత్‌లో నవ శకం!

## రాయదుర్గం నియోజకవర్గంలో సుజ్లాన్ మెగా ప్రాజెక్టుల ప్రారంభం

**1,325 మెగావాట్ల సామర్థ్యం.. రూ.10 వేల కోట్ల పెట్టుబడి**

**నారా లోకేశ్ చేతుల మీదుగా ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ప్రారంభం**

**రాయదుర్గం (జర్నలిస్ట్ ఫైల్) :** పవన విద్యుత్ రంగంలో ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర గ్రామం వద్ద సుజ్లాన్ 1,325 మెగావాట్ల విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయా పవన విద్యుత్ ప్రాజెక్టులు రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యంతో నెలకొల్పనున్నారు. ఇందులో భాగంగా సుజ్లాన్ ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను మంత్రి ప్రారంభించారు. రూ.10వేల కోట్ల పెట్టుబడితో సుజ్లాన్ సంస్థ ఏర్పాటుచేయనున్న పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముందుగా కణేకల్లు మండలం హులికెరకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు సుజ్లాన్ కంపెనీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సుజ్లాన్ 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపనతో పాటు సుజ్లాన్ ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను మంత్రి ప్రారంభించారు. శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన ఏవీని మంత్రి వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని హాలకుంది గ్రామంలో సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించారు. సుజ్లాన్ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విండ్ టర్బైన్ పై సంతకం చేశారు. సుజ్లాన్ సంస్థ ప్రస్తుతం 1,700కు పైగా మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో ఏపీలో అతిపెద్ద విండ్ భాగస్వామిగా అవతరించింది. 2030 నాటికి 5వేల మెగావాట్ల అదనపు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల స్థాపన లక్ష్యంగా మిగతా 2లో...

## దక్షిణాది కలిస్తే.. నంబర్-1!

**కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ కలిసి అభివృద్ధిలో ముందడుగు వేయాలి**

**నదుల అనుసంధానంతో చివరి ఎకరాకు సాగునీరు**

**అన్ని రంగాల్లో దక్షిణ భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలపాలని లోకేశ్ పిలుపు**

వివరాలు 2లో...

## గెలుపే లక్ష్యం.. ఐక్యతే బలం!

**కూటమి ఐక్యతను కాపాడండి..**

**అనంతపురం అభివృద్ధి నా బాధ్యత..**

**కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం**

వివరాలు 2లో...

# తాటి వనం... తీరానికి రక్షణ కవచం

- గ్రేట్ గ్రీన్ వాల్ రెండో అంచెలో తుపాను గాలి నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు
- తాటి గింజల సేకరణ, నాటే ప్రక్రియ ప్రారంభం
- 5,499 హెక్టార్ల విస్తీర్ణంలో 55 లక్షల తాటి గింజలు నాటడం లక్ష్యం
- సీజన్ ప్రారంభంలోనే 13 లక్షల తాటి గింజలు సేకరించిన అటవీ శాఖ
- తాటి వనాల ఏర్పాటు ప్రక్రియలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ పిలుపు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సుదీర్ఘ తీర ప్రాంతానికి సహజ రక్షణ కవచం ఏర్పాటు దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తీసుకున్న గ్రేట్ గ్రీన్ వాల్ సంకల్పంలో కీలకమైన తాటి వనాల ఏర్పాటు ప్రక్రియ మొదలయ్యింది. తాటి కాయల సీజన్ ప్రారంభం కావడంతో తాటి గింజల సేకరణ, నాటే కార్యక్రమానికి మిగతా 3లో...

# లోకాయుక్తగా మల్లిఖార్జునరావు

- గవర్నర్ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కార్యక్రమం
- లోక్‌భవన్ దర్బార్ హాల్‌లో బాధ్యతల స్వీకరణ

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా నియమితులైన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని లోక్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో గవర్నర్ ఆయనతో ప్రమాణం చేయించారు. జీఏడీ ముఖ్య కార్యదర్శి జె.



శ్యామలరావు కార్యక్రమాన్ని ప్రారంభించగా, అనంతరం ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త రిజిస్ట్రార్ గవర్నర్ జారీ చేసిన నియామక వారెంట్‌ను చదివి వినిపించారు. ప్రమాణ స్వీకారం అనంతరం మిగతా 2లో...

# వడ్డెర సత్రంలో దారుణం..

- శ్రీశైలంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య
- ఇద్దరు పురుషులు.. ముగ్గురు మహిళల మృతి
- శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన కుటుంబంగా గుర్తింపు
- ఆర్థిక ఇబ్బందులే కారణమై ఉండొచ్చని పోలీసుల అనుమానం

**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీశైలంలోని వడ్డెర సత్రంలోని రూమ్ నెం.11లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో ఇద్దరు గదిలోని హాలులో ఫ్యాన్‌కు ఉరేసుకోగా, స్నానాల గదిలో ముగ్గురు



మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. 3 రోజుల క్రితమే జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సత్రంలోని గది నుంచి దుర్వాసన వస్తుండటంతో నిర్వాహకులు వెళ్లి చూడగా మృతదేహాలు కనిపించాయి. దీంతో వారు పోలీసులకు మిగతా 3లో...

## పీఎంఎఫ్ఎంఈలో

# ఏపీ 'బెస్ట్'!

- దేశవ్యాప్త మూల్యాంకనంలో సెర్ప్-ఏపీకి ఉత్తమ పనితీరు గుర్తింపు
- సీడ్ క్యాపిటల్, రుణాల పంపిణీలో జాతీయ అవార్డు
- న్యూఢిల్లీలో పురస్కారం అందుకున్న రాష్ట్ర ప్రతినిధులు

3లో

# ఏపీ-యూకే 'అర్బన్' జోడీ!

- పట్టణాభివృద్ధికి కీలక ఒప్పందం
- అమరావతితో పాటు 123 మున్సిపాలిటీల అభివృద్ధికి యూకే నైపుణ్యం
- రూ.40 వేల కోట్ల మౌలిక వసతుల పనులకు ఆధునిక సాంకేతికత వినియోగం




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిని అంతర్జాతీయ నైపుణ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర మౌలిక వసతులతో మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాల్లో దీర్ఘకాలిక సహకారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-యునైటెడ్ కింగ్డమ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం (వీశీఖ) మంగళవారం అమరావతిలో కుదిరింది. వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్,యూకే ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ బిజినెస్ అండ్ ట్రేడ్ గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా ఒప్పందంపై సంతకాలు చేశారు. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ నాయకత్వంలో ఏపీ ప్రతినిధి బృందం, మిగతా 3లో...

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్ అండ్ బీ, జల వనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.



**2027 పుష్కరాలకు భారీగా భక్తులు :** 2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా. 2027లో 8 నుంచి 10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 ఘాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

**టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి :** గోదావరి పరివాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయని... పిఠాపురంలో శక్తి పీఠం సహా పంచారామాల్లో 4 క్షేత్రాలు, ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రధాన ఆలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హోం స్టేలను ప్రోత్సహించాలని సూచించారు. కొత్తగా హోటళ్ల నిర్మాణం చేపట్టేవారికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. సమీక్షలో ఇంకా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. దేశ విదేశాల్లో ప్రముఖులు అందరికీ గోదావరి పుష్కరాలకు ఆహ్వానం అందించాలి. రాష్ట్ర విశిష్టత తెలిసేలా, ప్రతిష్ట పెరిగేలా చేసేందుకు ఇదొక అవకాశంగా భావించాలి. కూచిపూడి ఈవెంట్ వంటివి భారీ తరహాలో నిర్వహించేలా దేవా దాయ-పర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలి. పుష్కర ఘాట్లను కలిపే రహదారుల నిర్మాణం సహా, పుష్కరాలు జరిగే 6 జిల్లాలో ఏ రోడ్లపైనా గుంతలు కనిపించకూడదు. పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. బ్రిడ్జిల సామర్థ్యాన్ని పరిశీలించి, దానికి అనుగుణంగా మరమ్మతులు చేయాలి. గోదావరిలో చుక్క కూడా మురుగు నీరు కలవకుండా చూడాలి. అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలో దీవుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.' అని నిర్దేశించారు.

**రద్దీ నిర్వహణకు ఏఐ వినియోగం :** ఈసారి పుష్కరాల్లో భద్రత, రద్దీ నిర్వహణకు ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ ఎంట్రీ-ఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు, డీసెంట్రలైజ్డ్ డిప్లాయ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతికత వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య సేవల పరంగానూ ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. 30 ఫీల్డ్ ఆస్పత్రులను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసి, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

**మోడల్ పుష్కర పంచాయతీగా ముని కూడలి :** గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపెట్టారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు-పోలవరం మీదుగా పట్టిసీమ రోడ్డు, సీతానగరం నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరకు దీ రోడ్డు, అలాగే అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్... సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుంచి కొవ్వూరు వరకు రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. రాజమహేంద్రవరం-పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు. అలాగే 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 2,697 రెస్క్యూ బోట్లు సిద్ధం చేయడంతో పాటు, 8,955 శిక్షణ పొందిన ఈతగాళ్లను పుష్కరాల సమయంలో నియమించనున్నారు.

**అఖండ గోదావరికి పుష్కర ఏర్పాట్లు :** గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర ఏర్పాట్లను అద్భుతంగా చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వెలిగొండ జలసిరులతో అభివృద్ధికి రెక్కలు

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ ప్రకాశాన్ని పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ప్రతి రైతు పొలానికి నీరు, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడమే తన సంకల్పమని పేర్కొన్నారు. వెలిగొండ జలాలతో కరువు నేల సస్యశ్యామలం కావడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని చంద్రబాబు తెలిపారు.

## పవన విద్యుత్‌లో నవ శకం!




(మొదటి పేజీ తరువాయి)

సుజ్లాన్ సంస్థ ప్రణాళికలు రూపొందించి, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జీ.లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్, సుజ్లాన్ గ్రూప్ కో ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్‌తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వీబీ రావు, టాటా పవర్ ఎండీ, సీఈవో సంజయ్ బంగా, సుజ్లాన్ గ్రూప్ డైరెక్టర్ రంజిత్ సిన్హ్ అభయ్ సిన్హ్ పర్మార్, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.కమలాకర బాబు, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు.

## లోకాయుక్తగా మల్లిఖార్జునరావు




(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జస్టిస్ మల్లిఖార్జునరావును అభినందించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

కార్యక్రమంలో కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంతరాము, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, న్యాయశాఖ అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యం.. ఐక్యతే బలం!



రాయదుర్గం (జర్నలిస్ట్ ఫైల్) :తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పించడమే తమ లక్ష్యమని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ పిలుపునిచ్చారు. రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్ మండలం నల్లంపల్లి వద్ద నిర్వహించిన నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**రాయదుర్గం ప్రజలకు ప్రేమ, పౌరుషం, అభిమానం ఎక్కువే :** "విజయనగరం రాజుల మూడో రాజధాని రాయదుర్గం. రాయదుర్గం కోటలో ఎంత పౌరుషం ఉందో.. ఇక్కడి ప్రజల్లోనూ అంతే పౌరుషం ఉంది. ఇక్కడ పట్టు చీరలు, జీన్స్ ఎంత ఫేమసో.. మీ ప్రేమ, అభిమానం, స్టైల్ కూడా అంతే ఫేమస్. అవన్నీ ఈరోజు ప్రత్యక్షంగా చూశాను. గత 11 ఎన్నికల్లో టీడీపీ కేవలం 4 సార్లు మాత్రమే గెలిచినా.. గెలిచినా, ఓడినా రాయదుర్గం నియోజకవర్గాన్ని గుండెల్లో పెట్టుకుని అభివృద్ధి చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు. ఓబుళాపురం గనుల పేరుతో అడ్డగోలుగా అక్రమ మైనింగ్ జరుగుతున్నప్పుడు కమిటీ వేసి ప్రజల తరపున పోరాడింది టీడీపీ. నాడు మనం చేసిన పోరాటానికి ఫలితంగా తాజాగా తీర్పు వచ్చింది. ప్రజల కోసం పోరాడింది.. ప్రజల తరఫున నిలబడింది తెలుగుదేశం పార్టీనే. మీ అందరి కష్టం, శ్రమతో 2024లో కాలవ శ్రీనివాసులు గారిని 43 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించుకున్నాం. పట్టుదల, క్రమశిక్షణతో నియోజకవర్గానికి నాయకత్వం వహిస్తున్న కాలవ శ్రీనివాసులు గారు.. ఎప్పుడూ నియోజకవర్గ అభివృద్ధి గురించే మాట్లాడుతుంటారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంది. ప్రజలకు తాగునీరు, పంటలకు సాగునీటి సమస్య రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాయదుర్గం ప్రాంతంపై కూడా ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ.. ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా కాలవ శ్రీనివాసులు గారు నిరంతరం కృషి చేస్తున్నారు. అసెంబ్లీలో నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాష్ట్రానికి అవసరమైన అంశాలపై కూడా మాకు విలువైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు" అని తెలిపారు.

**కార్యకర్తలే పార్టీకి బలం :** "ఈ రోజు మేము మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా వేదికపై కూర్చున్నామంటే దానికి ప్రధాన కారణం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే. అహర్నిశలు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు ఎన్నో కేసులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా 2019-24 మధ్య కాలంలో దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు ఎదురైనా ఎత్తిన పసుపు జెండాను దించకుండా పార్టీ కోసం పోరాడారు. గొడ్డలి పార్టీ కుట్రలకు, అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలం. అందుకే తెలుగుదేశం పార్టీ కార్యకర్తే అధినేత. దేశంలో మరే రాజకీయ పార్టీ కల్పించని విధంగా కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తున్న పార్టీ టీడీపీ. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటికే రూ.160 కోట్లు ఖర్చు చేశాం. కష్టపడి పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం కల్పించడమే మా లక్ష్యం" అని అన్నారు.

**మైటీడీపీ యాప్‌లో మీ ఫీడ్ బ్యాక్ ఇవ్వండి.. నేను పరిష్కరిస్తాను :** "యువగళం పాదయాత్రలో కార్యకర్తలను కలిసినప్పుడు.. "పార్టీ కోసం పనిచేస్తున్నవారికి ప్రాధాన్యత ఇవ్వండి.. మమ్మల్ని గుర్తించండి" అని చాలామంది కోరారు. అందుకే మైటీడీపీ యాప్‌ను తీసుకొచ్చాం. మీరు పాల్గొనే ప్రతి పార్టీ కార్యక్రమం, మీరు సొంతంగా చేపట్టే ప్రతి కార్యక్రమం పార్టీకి తెలియాలంటే మైటీడీపీ యాప్‌లో ఫీడ్ చేయండి. క్లస్టర్, యూనిట్, బూత్ సమావేశాల్లో మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను మేము చదువుతున్నాం. మీరు చెప్పే సమస్యలు, సూచనలు మాకు చేరడం లేదనే అపోహ వద్దు. కొత్త పెన్షన్లు, ఇళ్లు ఇవ్వాలని కార్యకర్తలే ఫీడ్‌బ్యాక్‌లో కోరారు. కొత్త పెన్షన్ లు ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిది. ఇలా మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే నేను నిర్ణయాలు తీసుకుంటాను. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కచ్చితంగా గుర్తింపు దక్కుతుంది. మీరు మమ్మల్ని వెతుక్కుంటూ రావాల్సిన అవసరం లేదు.. మేమే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాం. కోటి మంది సభ్యులతో కూడిన కుటుంబం మనది. సముద్రం లాంటి ఈ కుటుంబంలో సమస్యలు సహజం. మనలో మనమే చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలి. ఎక్కడైనా మీ సమస్య పరిష్కారం కాకపోతే మా దగ్గరకు రండి. మీకు అండగా నేను ఉంటాను. కార్యకర్తల కోసం, పార్టీ కోసం ఎప్పుడూ ముందుండి పనిచేస్తాం" అని హామీ ఇచ్చారు.

**టీడీపీలో కార్యకర్తే అధినేత :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ నియోజకవర్గానికి వెళ్లినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అనంతరం కార్యకర్తలను కలవడానికే ప్రాధాన్యత ఇస్తారు. ప్రతి కార్యకర్తతో మాట్లాడి, ఫొటో దిగి, వారి సమస్యలను తెలుసుకున్న తర్వాతే అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు. కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఇచ్చే విలువకు ఇదే నిదర్శనం. 2025 మహానాడులో ప్రవేశపెట్టుకున్న ఆరు శాసనాల్లో "కార్యకర్తే అధినేత" అనేది అత్యంత ముఖ్యమైనది. టీడీపీలో కార్యకర్తే అధినేత. అందుకే మహానాడు, అసెంబ్లీ, మండలి సహా పార్టీకి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో కార్యకర్తలు ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి వేదికను పంచుకుంటున్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పించడం టీడీపీ బాధ్యత. కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది. పార్టీ కోసం ప్రాణాలు వదిలిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు చట్టాన్ని సవరించి బిల్లు తీసుకొచ్చాం. వైసీపీ ఎమ్మెల్సీలు అడ్డుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరకు బిల్లును చట్టంగా చేసి చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాం. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రాణాలు అర్పించిన కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన గౌరవానికి ఇదే నిదర్శనం.

**అనంత అభివృద్ధి నా బాధ్యత :** "ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీకి కంచుకోట. మా కుటుంబాన్ని ఆశీం-ర్వదించి గెలిపించిన ప్రజలు అనంతపురం జిల్లా ప్రజలు. నాడు ఎన్టీఆర్ గారిని గెలిపించి అసెంబ్లీకి పంపించిన గొప్ప నేల ఇది. మా హరిమామను శాసనసభకు, పార్లమెంట్‌కు, మా ముద్దుల మామ బాలకృష్ణ గారిని మూడు సార్లు అసెంబ్లీకి పంపించిన ఘనత అనంతపురం ప్రజలది. ఈ అభిమానాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటాం. అహర్నిశలు మీ కోసం కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను. అందుకే అనంతపురం జిల్లాకు ప్రత్యేక సంస్థలు, పరిశ్రమలు తీసుకొచ్చి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో భారీ పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ప్రతిష్టాత్మకమైన ఫైటర్ జెట్ తయారీ సంస్థ కూడా అనంతపురం ప్రాంతానికి సొంతమైంది. ఏ రంగంలో అయినా ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. అదే పోటీతత్వం ఎమ్మెల్యేల మధ్య కూడా ఉండాలి. ఉరవకొండలో తయారయ్యే విండ్‌మిల్‌పై "మేడ్ ఇన్ ఉరవకొండ" అని మంత్రి కేశవ్ గారు పెట్టుకుంటున్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాలకు కంపెనీలు తీసుకురావాలి.. తమ నియోజకవర్గానికి పేరు రావాలని పోటీతత్వంతో పనిచేయాలి" అని కోరారు.

**రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం :** "రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధికంగా పెన్షన్లు అందిస్తున్నాం. దీపం 2.0 కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నాం. తల్లికి వందనం, చేనేతలకు ఉచిత విద్యుత్, చేనేత సేవ, మత్స్యకార సేవ, ఆటోవాలా సేవ వంటి కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ఆర్థిక సహాయం అందిస్తున్నాం. పెన్షన్ల కోసం ఏటా రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు తొలి సంతకం డీఎస్సీ ఫైల్‌పైనే చేశారు. వెంటనే దాన్ని కార్యాచరణలోకి తీసుకొచ్చి 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. ఎన్ని కేసులు వేసి అడ్డుకోవాలని చూసినా నియామకాలు పూర్తి చేశాం. కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేశాం. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. పరిశ్రమలను ఆకర్షిస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. నేడు పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంది. ఈ అభివృద్ధికి బ్రాండ్ చంద్రబాబు. గొడ్డలి పార్టీలో గొడ్డలి బ్యాచ్, ఫ్యాక్షనిస్టులు, దొంగలు ఉంటారు కాబట్టే వారి ఆలోచనలు కూడా అలాగే ఉంటాయి. కానీ చంద్రబాబు గారి ఆలోచన ఎప్పుడూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం చుట్టూనే ఉంటుంది. ఆ మార్పును మనమంతా ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం" అని అన్నారు.

**కూటమి ఐక్యతను కాపాడండి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే మన లక్ష్యం :** "కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి కూటమిలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. జనసేన, బీజేపీ పేరుతో టీడీపీని తిడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలి. వాళ్ల ప్రచారాన్ని నమ్మి ఆవేశపడకుండా కూటమి ఐక్యతను కాపాడాలి. మనమంతా ఐక్యంగా ఉండి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుంది. ఈ విషయాన్ని ప్రజలకు వివరించి కూటమి బలాన్ని మరింత పెంచాలి" అని పిలుపునిచ్చారు.

**కణేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసే బాధ్యత నాది :** "మీ అభిమానానికి నేను ధన్యుడిని. యువగళం పాదయాత్రలో కణేకల్‌కు రాలేకపోయిన లోటు నేడు తీరిపోయింది. మీరు ఇచ్చిన ఘన స్వాగతం, చూపించిన ప్రేమ, అభిమానం ఎప్పటికీ మరిచిపోలేను. పట్టణ అధ్యక్షుడి ఆత్మీయ పలకరింపు నా గుండెను హత్తుకుంది. వీలైతే మీ ఇంటికి భోజనానికి వస్తాను. గతంలో కణేకల్‌కు సీఎం చంద్రబాబు గారు వచ్చినప్పుడు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పూర్తిస్థాయిలో జరగడం లేదు. కానీ కణేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసే బాధ్యత నాది. నిధులు సమకూర్చే బాధ్యత మంత్రి కేశవ్ గారిది. రెండు సంవత్సరాల్లో అడ్మిషన్లు పూర్తిస్థాయికి తీసుకెళ్లే బాధ్యత స్థానిక ఎమ్మెల్యేది" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జీ.లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జోనల్ కోఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి, అనంతపురం పార్లమెంట్ ప్రెసిడెంట్ పూల నాగరాజు, అనంతపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్ చౌదరి, నియోజకవర్గ పరిశీలకులు బి. గురప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దక్షిణాది కలిస్తే.. నంబర్-1!



బళ్ళారి (జర్నలిస్ట్ ఫైల్) : బళ్ళారి మండలం కుడితినిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు స్థానిక తెలుగు ప్రజానీకం, యువత, టీడీపీ అభిమానులు ఘనస్వాగతం పలికారు. స్థానిక తెలుగు సంఘాల ఆధ్వర్యంలో భారీ గజమాలతో మంత్రిని సత్కరించి, పెద్దఎత్తున బాణసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగువారి సంక్షేమమే టీడీపీ ధ్యేయం. "దశాబ్దాల క్రితం ఉపాధి కోసం బళ్ళారికి వచ్చి స్థిరపడినా... మీ హృదయంలో ఆంధ్రప్రదేశ్ స్థానం ఎప్పటికీ పదిలమే. ఇక్కడ ఆర్థికంగా ఎదుగుతున్నప్పటికీ, మీ మనసంతా నిరంతరం మన రాష్ట్ర శ్రేయస్సు పైనే ఉంటుంది. నాడు ఆత్మగౌరవ నినాదంతో, తెలుగుజాతి ఐక్యత, ఉన్నతి కోసం నందమూరి తారకరామారావు గారు తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ప్రపంచంలో తెలుగు వారు ఎక్కడున్నా వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ఏకైక పార్టీ తెలుగుదేశం. ఆనాడు ఉత్తరాఖండ్ విపత్తులో చిక్కుకున్న మనవారిని కాపాడేందుకు స్వయంగా చంద్రబాబు గారే రెస్క్యూ బృందంతో వెళ్లారు. 'మీరు తెలుగువారైతే ధైర్యంగా విమానం ఎక్కండి... మిమ్మల్ని సురక్షితంగా ఇంటికి చేర్చే బాధ్యత నాది' అని భరోసానిచ్చి వారిని కాపాడిన ఘనత ఆయనది. అన్ని రంగాల్లోనూ తెలుగువారు నంబర్-1గా నిలవాలన్నదే మన అందరి లక్ష్యం. బళ్ళారిలో నివసిస్తూ కూడా ఐక్యతతో మెలుగుతూ, ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్న మీ కృషి అభినందనీయం" అని అన్నారు.

**బళ్ళారి గడ్డపై మీ పోరాటం మాకు కొండంత అండనిచ్చింది :** "2023 సెప్టెంబర్ 9న ఏ తప్పూ చేయని మన నాయకుడు చంద్రబాబు గారిని అరెస్ట్ చేసినప్పుడు మా కుటుంబం ఎంతో వేదనకు, ఆందోళనకు గురైంది. అలాంటి క్లిష్టమైన సమయంలో మా కుటుంబానికి కొండంత అభయంగా నిలిచింది మీరే. భయానక వాతావరణం నెలకొన్న ఆ రోజుల్లో, ధైర్యంగా బయటకు వచ్చి బళ్ళారి గడ్డపై మీరు చేసిన ధర్నా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరిలో కొత్త స్ఫూర్తిని నింపింది. మీరు అందించిన ఆ ధైర్యాన్ని మేము ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటాం. మిమ్మల్ని జీవితాంతం గుర్తుపెట్టుకుని, మీకు అండగా నిలబడే బాధ్యత నాది. ఆంధ్ర రాష్ట్రానికి రండి, మనమందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం. తెలుగువారందరూ ఎక్కడున్నా ఐక్యంగా ఉండాలనేదే మా ఆశయం" అని అన్నారు.

**దక్షిణ భారత అభివృద్ధికి కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ కలిసి ముందడుగు వేయాలి :** "కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఎప్పటినుంచో అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉంటున్నాయి. నాడు కర్ణాటక మాజీ సీఎం ఎస్.ఎం.కృష్ణ గారు, అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు గారి మధ్య ఉన్న ఆరోగ్యకరమైన అభివృద్ధి పోటీతత్వమే నేడు బెంగళూరు, హైదరాబాద్ నగరాలను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టింది. అదే స్ఫూర్తితో మనం మళ్లీ ముందడుగు వేయాలి. ఇటీవల దక్షిణ భారత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ గారు "దక్షిణ భారతదేశమంతా ఒక్కటై కలిసికట్టుగా అభివృద్ధి సాధించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్, బళ్ళారి టీడీపీ నాయకులు రాము, అనూప్ కుమార్ మరియు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





# చంద్రబాబు అంటేనే సంక్షేమం.. అభివృద్ధి అంటేనే కూటమి ప్రభుత్వం





- 29 రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ దిక్సూచి
- ఎమ్మెల్సీ, తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అంటేనే సంక్షేమం.. సంక్షేమం అంటేనే కూటమి ప్రభుత్వం అని ఎమ్మెల్సీ, తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు నిర్వహిస్తున్న 'రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి.. సంక్షేమం' ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆదివారం తెనాలి పట్టణంలోని 35, 36 వార్డుల్లో కూటమి నాయకులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. అనంతరం ఆలపాటి మాట్లాడుతూ దేశంలోని 29 రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ దిక్సూచిగా నిలుస్తోందని, ఇతర రాష్ట్రాల్లో అమలు కాని విధంగా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, సూపర్ సిక్స్ పథకాలతో పాటు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, పోలీసు ఉద్యోగాల భర్తీ కూడా చేపట్టామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఆలపాటి తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలను తిరిగి తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. గత పాలకుల హయాంలో రాష్ట్రంలో గంజాయి, అవినీతి, దోపిడీ, అరాచక పాలన కొనసాగిందని విమర్శించారు. కూటమి రెండేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసి అన్ని రంగాల్లో పురోగతికి చర్యలు చేపట్టిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమేనని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## ఇన్-సర్వీస్ టీచర్ల టెట్ రద్దు, మినహాయింపులపై ఏపీటీఎఫ్ నిరసన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఇన్–సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయడంతో పాటు ప్రత్యేక టెట్‌లో మినహాయింపులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 26న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ అంశంపై అనేకసార్లు ప్రాతినిధ్యాలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకపోవడం, టెట్ రద్దు, మినహాయింపులకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌సీటీఈకి పంపకపోవడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇన్–సర్వీస్ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే ఈ నిరసనల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి పిలుపునిచ్చారు.

ఇన్–సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్‌ను రద్దు చేసేందుకు విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23(1)ను సవరించాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. ప్రత్యేక టెట్‌లో అందరికీ 40 శాతం పాస్ మార్కులు నిర్ణయించాలని, ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను మాత్రమే పరీక్షల్లో ఇచ్చేలా సిలబస్‌ను మార్చాలని కోరింది. అలాగే ఆన్‌లైన్‌కు బదులుగా ఆఫ్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని, ఇన్–సర్వీస్ టెట్‌ను డిసెంబర్‌లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

## వడ్డెర సత్రంలో దారుణం..

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం అందించారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఘటనపై శ్రీశైలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాదాపు నెల రోజుల నుంచి వీరంతా వడ్డెరసత్రంలో బస చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మృతులు శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన పల్లపు సుధాకర్(36), మల్లేశ్వరి(45), శ్రీదేవి(33), గోగుల ఆదిలక్ష్మి(50), మణికంఠ(15)గా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులే వీరి ఆత్మహత్యకు కారణమని అనుమానిస్తున్నారు.

"గత నెల 28న సుధాకర్‌తో పాటు ఆయన ముగ్గురు తోబుట్టువులు, మేనల్లుడు శ్రీశైలం వచ్చారు. రోజుకు రూ. 800 అద్దె చెల్లిస్తూ వడ్డెర సత్రం గదిలో ఉంటున్నారు. ఇన్ని రోజులు ఉండకూడదన్నా.. ఆరోగ్యం బాగాలేదంటూ కొనసాగారు. బత్తలపల్లికి చెందిన సుధాకర్, ఆయన చెల్లెళ్లు, మేనల్లుడు ఉరేసుకున్నారు. సుధాకర్‌కు ఇంకా వివాహం కాలేదు. ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి చేసినా భర్తలను వదిలేసి ఇంటి వద్దే ఉంటున్నారు. వీరికి ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నట్టు తెలుసుకున్నాం. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డారు. బత్తలపల్లిలోని వారి బంధువులకు సమాచారం ఇచ్చాం. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం" అని డీఎస్పీ తెలిపారు.

## పీఎంఎఫ్ఎంఈలో ఏపీ 'బెస్ట్'!



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం అమలులో ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయి అవార్డు లభించింది. సీడ్ క్యాపిటల్, హయ్యర్ ఆర్డర్ ఎంటర్‌ప్రైజెస్‌కు రుణాల అందజేతలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్–ఏపీ) కనబరిచిన ఉత్తమ పనితీరుకు ఈ అవార్డు దక్కింది. న్యూఢిల్లీలో ఆగస్టు 24, 25 తేదీల్లో కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో నిర్వహించిన దేశవ్యాప్త పీఎంఎఫ్ఎంఈ కాంక్లేవ్‌లో కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ అవార్డును ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ తరఫున జీవనోపాధుల విభాగం డైరెక్టర్ డాక్టర్ శివ శంకర ప్రసాద్, అదనపు డైరెక్టర్ కె. సరళ, కన్సల్టెంట్ రమ్య అవార్డును స్వీకరించారు.

పీఎంఎఫ్ఎంఈ సీడ్ క్యాపిటల్ కాంపోనెంట్ కింద నిర్దేశించిన పనితీరు ప్రమాణాల ఆధారంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందిస్తున్న సేవలు, నిధుల వినియోగం, ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల అభివృద్ధి, బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాల అందజేత తదితర అంశాలపై వివిధ రాష్ట్రాల పనితీరును కేంద్ర మంత్రిత్వ శాఖ మూల్యాంకనం చేసింది. ఈ మూల్యాంకనంలో సెర్ప్––ఏపీ సమగ్ర పనితీరు ఆధారంగా ఉత్తమ పనితీరు కనబరిచిన సంస్థల్లో ఒకటిగా ఎంపికైంది. పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు సీడ్ క్యాపిటల్, సబ్సిడీతో కూడిన రుణాలు అందించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సెర్ప్ చేపట్టిన చర్యలను పలువురు అభినందించారు. ఈ అవార్డు రాష్ట్రంలోని మహిళా పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల పెంపు, మహిళల ఆర్థిక సాధికారత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కరుణ వాకాటి తెలిపారు.

# తాటి వనం... తీరానికి రక్షణ కవచం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రకృతి విపత్తుల సమయంలో గాలి నిరోధక వ్యవస్థగా తాటి వనాలు తీర ప్రాంత గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పించనున్నాయి. మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్ ఏర్పాటు ప్రక్రియలో తాటి వనాల ఏర్పాటుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఉప్పు నీరు, హోరు గాలులతో ఉండే తీర ప్రాంతాల కఠిన వాతావరణ పరిస్థితులకు తాటి చెట్టు అత్యంత అనుకూలమైన వృక్ష జాతి. ఉప్పు నేలలు, ఇసుక, బురదతో కూడిన తీర ప్రాంత ఒండ్రు నేలల్లో సైతం పెరిగే సామర్థ్యం తాటి చెట్టుకు ఉంది. ఎత్తుగా పెరిగే జాతి కావడంతో బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా పని చేస్తుంది. అంతేకాకుండా బలమైన తాటి వేర్లు నేలను గట్టిగా పట్టి ఉండడం వల్ల తీర ప్రాంతాల్లో కోత నిరోధక వ్యవస్థగా కూడా ఉంటుంది. పక్షులు, కొన్ని రకాల సరిసృపాలకు ఆవాసంగా ఉండే తాటి చెట్లు జీవ వైవిధ్యానికి ప్రతీకగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా తట్టుకోగల శక్తి తాటి చెట్టు సొంతం. అందుకే పవన్ కళ్యాణ్ రూపొందించిన మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్



ప్రణాళికల్లో మొదటి అంచె మడ అడవులకు, రెండో అంచె తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్ల పరిధిలో తాటి వనాల ఏర్పాటును లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. అందుకు దాదాపు 55 లక్షల తాటి గింజలు అవసరం అవుతాయని అటవీ శాఖ భావిస్తోంది. ఈ ఏడాది తాటి కాయల సీజన్ మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామీణ ప్రజలు, వివిధ వ్యవస్థల భాగస్వామ్యంతో 13 లక్షల తాటి గింజలు సేకరించారు. ఇప్పటికే 1 లక్ష 65 వేల తాటి గింజలను పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, స్కూలు విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో నాటే ప్రక్రియను రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. ఈ సీజన్‌లో పవన్ కళ్యాణ్ నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న బలమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్టు ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

తాటి గింజల సేకరణ, నాటడం, తాటి మొక్కల పెంపకం వంటి అంశాల్లో రాష్ట్ర అటవీ శాఖకు ప్రజలంతా సహకరించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. మొలకెత్తే తాటి మొక్కల స్వీయ సంరక్షణ చర్యలు చేపట్టాలని, మొలకెత్తిన మొక్కల పైకి పశువులను తోలడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. విలువైన సహజ సంపదను కాపాడుకునే చర్యల్లో అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బందికి సహకరించాలని కోరారు. స్థానిక ప్రజలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. తీర ప్రాంతాల వెంబడి అనుకూల ప్రదేశాల్లో శాస్త్రీయ పద్ధతిలో తాటి గింజల నాటాలని పేర్కొన్నారు.

గ్రేట్ గ్రీన్ వాల్‌తోపాటు 50 శాతం గ్రీన్ కవర్, పర్యావరణ పునరుద్ధరణ, రాష్ట్రంలో సహజ వనరుల పరిరక్షణ చర్యల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయాలని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించే ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ఏపీ-యూకే 'అర్బన్' జోడీ!

(మొదటి పేజీ తరువాయి)

యూకే ప్రతినిధి బృందం కార్యక్రమంలో పాల్గొన్నాయి.

**అమరావతితో పాటు రాష్ట్ర పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం :** ఈ భాగస్వామ్యంలో అమరావతి కీలక సహకార రంగంగా నిలవనుంది. ఆధునిక, సుస్థిర, పర్యావరణహిత, మెరుగైన కనెక్టివిటీతో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి యూకే నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం మరింత బలం చేకూర్చనుంది.

అమరావతితో పాటు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ఈ సహకారం ఉపయోగపడనుంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర ప్రాథమిక మౌలిక వసతులను మరింత సమర్థవంతంగా అభివృద్ధి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దాదాపు రూ. 40 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులను టేకప్ చేసి, అనేక పనులకు టెండర్లు పిలిచి అమలు చేస్తున్నామని మంత్రి శ్రీ పి. నారాయణ తెలిపారు. ఈ పనుల్లో యూకేకు చెందిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉత్తమ విధానాలను వినియోగించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు.

**నాలుగు ప్రధాన రంగాల్లో సహకారం :** ఆంధ్రప్రదేశ్–యూకే భాగస్వామ్యం ప్రధానంగా మౌలిక వసతుల ప్రణాళిక, సుస్థిర పట్టణాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ–ఆవిష్కరణలు, సమగ్ర పట్టణ రవాణా వ్యవస్థలపై కొనసాగనుంది.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రాధాన్యత క్రమం, ఆర్థిక సాధ్యాసాధ్యాల అంచనా, పెట్టుబడులకు అనుకూలమైన బిజినెస్ కేసుల రూపకల్పన, ప్రాజెక్ట్ డిజైన్, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్, అమలు వంటి అంశాల్లో ఇరు ప్రభుత్వాలు కలిసి పనిచేయనున్నాయి.

రాష్ట్రంలోని నగరాలను మెరుగైన అర్బన్ స్ట్రక్చర్‌తో స్మార్ట్, లివబుల్ సిటీలుగా తీర్చిదిద్దేందుకు యూకే నైపుణ్యాన్ని వినియోగించుకోనున్నారు. సుస్థిర పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక



పట్టణ ప్రణాళిక, సమర్థవంతమైన మౌలిక వసతుల రూపకల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**అమరావతి అభివృద్ధిలో యూకే నైపుణ్యం :** అమరావతి అభివృద్ధిలో యూకే సంస్థలతో ఇప్పటికే ఏర్పడిన అనుసంధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. లండన్‌కు చెందిన ఫోస్టర్ ం పార్ట్‌నర్స్ సంస్థ అమరావతి ప్రభుత్వ సముదాయంలోని అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం ఇరు పక్షాల మధ్య ఉన్న సహకారానికి ఉదాహరణగా నిలుస్తోంది.

అమరావతి తదుపరి దశ అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక, సుస్థిర మౌలిక వసతులు, పట్టణ రవాణా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టుల రూపకల్పన, అమలు తదితర రంగాల్లో యూకే నైపుణ్యాన్ని మరింతగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించనున్నారు.

అమరావతి రివర్‌ఫ్రంట్, పట్టణ పునరుద్ధరణ, మిశ్రమ వినియోగ అభివృద్ధి వంటి రంగాల్లోనూ అంతర్జాతీయ అనుభవాన్ని వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.

**ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం :** సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఆవిష్కరణలకు ఈ ఒప్పందంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్, బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్, డిజిటల్ ట్విన్స్, ఆధునిక నిర్మాణ సాంకేతికతలు, పరిశోధన–అభివృద్ధి వంటి రంగాల్లో సహకారం అందించనున్నారు.

యూకేలోని వివిధ సంస్థల అత్యుత్తమ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, నిపుణుల మధ్య జ్ఞాన మార్పిడిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

పట్టణ రవాణా వ్యవస్థలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఏపీ––యూకే కలిసి పనిచేయనున్నాయి. మెట్రో రైలు, బస్సు వ్యవస్థలు, విమానాశ్రయాల అనుసంధానం, పాదచారుల మౌలిక వసతులు, డేటా ఆధారిత రవాణా ప్రణాళిక వంటి అంశాలపై సహకారం కొనసాగనుంది. దీని ద్వారా పట్టణాల్లో కనెక్టివిటీ మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, కాలుష్యాన్ని నియంత్రించడం, ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**పెట్టుబడుల సమీకరణకు అవకాశాలు :** మౌలిక వసతుల ప్రాజెక్టులకు కొత్త ఆర్థిక నమూనాలు, పెట్టుబడుల సమీకరణ అవకాశాలను కూడా ఈ ఒప్పందం కల్పిస్తుంది. అర్హత కలిగిన ప్రాజెక్టులకు నిర్దేశిత ఆర్థిక అర్హతలు, డ్యూ డిలిజెన్స్, యూకే కంటెంట్ తదితర నిబంధనలకు లోబడి యూకే ఎక్స్‌పోర్ట్ ఫైనాన్స్ ద్వారా ఆర్థిక సహాయం పొందే అవకాశాలను పరిశీలించవచ్చు.

ఈ సందర్భంగా పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, యూకే డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.

అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత మెరుగ్గా అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నగరాలను లివబుల్ సిటీలుగా, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడానికి యూకే సహకారం అందించనుందని తెలిపారు.

# హైకోర్టులో జూడాల హామీ.. సమ్మె విరమణ



- జూడాల సమ్మెపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ
- సమ్మె విరమిస్తున్నట్లు హైకోర్టుకు తెలిపిన జూడాల సంఘం
- డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** జూనియర్ డాక్టర్ల సమ్మెకు మంగళవారం తెరపడింది. జూడాల సమ్మెపై దాఖలైన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణ సందర్భంగా ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సమ్మెను విరమిస్తున్నట్లు కోర్టుకు తెలిపింది. తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేలా ఆదేశించాలని జూడాల సంఘం న్యాయస్థానాన్ని కోరింది. దీనిపై స్పందించిన హైకోర్టు జూడాల డిమాండ్లపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో సమ్మె విరమించి విధులకు హాజరవుతామని జూడాల సంఘం స్పష్టం చేసింది. జూడాలు ప్రధానంగా స్టైపెండ్‌ను 30 శాతం పెంచాలని, ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచకూడదని, వైద్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏపీ జూడా ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి దశలవారీగా ఆందోళనలు కొనసాగాయి. తొలిదశలో నిరసనలు చేపట్టిన జూడాలు, 12 నుంచి రెండో దశలో అత్యవసర వైద్య సేవలను మాత్రమే అందిస్తూ ఆందోళన కొనసాగించారు. స్టైపెండ్ పెంపు విషయంలో ప్రభుత్వంతో చర్చలు కొలిక్కిరాకపోవడంతో ఈ నెల 17 నుంచి మూడో దశలో భాగంగా అత్యవసర సేవలతో పాటు ఇతర వైద్య సేవలను కూడా నిలిపివేసి సమ్మెను తీవ్రతరం చేశారు. దీంతో రోగులకు వైద్య సేవల్లో అంతరాయం కలగకుండా ప్రభుత్వం సెకండరీ, పబ్లిక్ హెల్త్ పరిధిలోని ఆసుపత్రుల వైద్యులను ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉంచింది. బోధనాసుపత్రుల్లో ఓపీ, ఐపీ, శస్త్రచికిత్సలు, డయాలసిస్, ట్రామా సేవలు కొనసాగేందుకు చర్యలు చేపట్టింది. జూడాలతో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పలుమార్లు చర్చలు జరిపినా డిమాండ్లపై ఏకాభిప్రాయం కుదరలేదు. తాజాగా హైకోర్టు జోక్యంతో ప్రభుత్వం రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో జూడాలు సమ్మె విరమించి విధుల్లోకి తిరిగి వెళ్లేందుకు అంగీకరించారు.

### 2.50 లక్షల సీఎంఆర్ సహాయం

## లావణ్య కుటుంబానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం భరోసా..

**నకిరేకల్, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డుకు చెందిన వలిగొండ లావణ్య అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆమె అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా రూ.2.50 లక్షల నాజా మంజూరు చేయించారు.ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం లావణ్య కుటుంబ సభ్యులకు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లావణ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు CMRF ద్వారా ఆర్థిక సహాయం అందేలా తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీరేశం తెలిపారు.

## చిప్పలపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం..

- నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య సంఘం భవనం, ఓపెన్ జిమ్‌లను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఘనంగా ప్రారంభం.



**నల్గొండ, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** నకిరేకల్ నియోజకవర్గంలోని నార్కెట్‌పల్లి మండలం చిప్పలపల్లి గ్రామంలో అనంతరం అర్హులైన గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు మె రుగైన సౌకర్యాలు, పారదర్శక పాలన అందించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంత రం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికా రులు, మహిళా సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంకటరమణ బైక్ షోరూంలో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం



**నల్గొండ, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలోని వెంకటరమణ బైక్ షోరూంలో అర్ధరాత్రి భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పలు బైక్‌లు, స్పేర్ పార్ట్స్ దగ్ధమై భారీ ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం.స్థానికులు సమాచారం అందించడంతో రెండు ఫైర్ ఇంజన్లతో ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనాస్థలాన్ని టూ టౌన్ సీఐ ఆదిరెడ్డి, ఎస్సై సైదాబాబు పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## ప్రజావాణికి 26 దరఖాస్తులు



**మిర్యాలగూడ, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మొత్తం 26 దరఖాస్తులు వచ్చినట్లు మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన ఈ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో సూచించారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

## ప్రభుత్వ బడులను గాలికి వదిలేసిన సర్కార్

- దామరచర్లలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ధర్నా




**మిర్యాలగూడ, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదా నాయక్ ఆరోపించారు. దామరచర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్ర సైదా నాయక్, వీరన్న నాయక్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు అందుబా టులోకి రాలేదని అన్నారు. ముఖ్యంగా విద్యార్థినులకు సరైన మరుగుదొడ్లు, వాటికి నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండల కేంద్రంలోని పాఠశాలలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని, మరుగుదొడ్లు లేక విద్యార్థినులు స్థానికుల ఇళ్లకు, స్నేహితుల ఇళ్లకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు అధికంగా ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడుతున్నారని, సమస్యలను పరిష్కరించకపోవడం ద్వారా వారిని విద్యకు దూరం చేసే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శించారు. ఈ సమస్యలపై గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రిలే నిరాహార దీక్షలు, రాస్తారోకోలు చేపట్టడంతో పాటు అవసరమైతే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు జగన్, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న నాయక్, గర్ల్స్ కన్వీనర్ ఝాన్సీ, చంటి, వంశీ, తరుణ్, పవన్, దత్తు, అభి పాల్గొన్నారు.

## లంచం మత్తులో రెవెన్యూ అధికారులు... ఏసీబీ వలలో చిక్కిన ఆలేరు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

- భూమి పౌతి చేయాలంటే 'మామూలు' తప్పదంటూ రూ.20 వేల డిమాండ్... బేరసారాల తర్వాత రూ.14 వేల లంచం తీసుకుంటుండగా జీపీవో, ఆర్ఐ రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్
- ఫిర్యాదుదారుడి ధైర్యంతో బట్టబయలైన అవినీతి దందా... కార్యాలయంలో గంటల తరబడి ఏసీబీ సోదాలు... అధికారుల్లో కలకలం





**ఆలేరు, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు కొందరు అవినీతి అధికారుల చేతుల్లో లంచాల కేంద్రాలుగా మారుతున్నాయనే విమర్శలకు మరోసారి బలం చేకూరింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన మెరుపు దాడుల్లో ఇద్దరు రెవెన్యూ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటం జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారింది.భూమి పౌతి (వారసత్వ మార్పిడి) వంటి సాధారణ రెవెన్యూ సేవను అందించడానికి కూడా లంచం తప్పనిసరి అన్నట్లు వ్యవహరించిన జీపీవో అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) పూర్ణచంద్రరావు ఏసీబీ వలలో చిక్కడంతో తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఆలేరు మండలం కొలనుపాక రెవెన్యూ పరిధిలోని ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బుడిగె మహేష్ తన తండ్రికి చెందిన 8 ఎకరాల వ్యవసాయ భూమిని తన పేరుపై పౌతి చేయించుకునేందుకు కార్యాలయాన్ని ఆశ్రయించాడు. నిబంధనల ప్రకారం ఎలాంటి అదనపు చెల్లింపులు లేకుండానే పూర్తి కావాల్సిన పనికి జీపీవో అహ్మద్, ఆర్ఐ పూర్ణచంద్రరావు కలిసి రూ.20 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.అంత మొత్తాన్ని ఇవ్వలేనని మహేష్ స్పష్టం చేసినప్పటికీ, "లంచం ఇవ్వకపోతే ఫైల్ కదలదు... పౌతి జరగదు" అంటూ అధికారులు ఒత్తిడి చేసినట్లు తెలిసింది. చివరకు బేరసారాలు జరిపి రూ.14 వేలకైనా ఇవ్వాలని పట్టుబట్టడంతో, అవినీతికి తలవంచని మహేష్ నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.

**రెండు రోజుల పాటు నిఘా.. పక్కా ప్రణాళికతో ఉచ్చు:**

శుక్రవారం అందిన ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. రెండు రోజుల పాటు రహస్యంగా నిఘా ఏర్పాటు చేసి, ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను ధృవీకరించారు. సోమవారం ముందస్తు ప్రణాళిక ప్రకారం తహసీల్దార్ కార్యాలయంలో ఉచ్చుపన్ని, రూ.14 వేల లంచం స్వీకరిస్తున్న సమయంలో జీపీవో అహ్మద్, ఆర్ఐ

**పూర్ణచంద్రరావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు:**

ఏసీబీ అధికారులు కార్యాలయంలోనే రసాయన పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఆధారాలను సేకరించినట్లు సమాచారం.

దాడుల సందర్భంగా కార్యాలయానికి వచ్చిన ప్రజలు, సిబ్బంది ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు.

**కస్టడీలోకి అధికారులు.. లోతుగా దర్యాప్తు:**

పట్టుబడిన ఇద్దరు అధికారులను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనలో మరెవరైనా అధికారుల ప్రమేయం ఉందా? గతంలో కూడా ఇదే తరహాలో లంచాలు వసూలు చేశారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిసింది.

**అవినీతిపై కొరడా... ప్రజల్లో హర్షం:**

ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ ఏసీబీ దాడులు జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లంచం అడిగితే భయపడకుండా ఏసీబీని ఆశ్రయిస్తే అవినీతి అధికారులను చట్టం ముందు నిలబెట్టవచ్చని ఈ ఘటన మరోసారి నిరూపించింది."లంచం అడిగితే మౌనం కాదు... ఫిర్యాదే పరిష్కారం" అనే సందేశాన్ని ఆలేరు ఏసీబీ ఆపరేషన్ మరోసారి స్పష్టంగా చాటి చెప్పింది.

## అచ్చంపేట అభివృద్ధికి రూ.146.71 కోట్ల రహదారి పనులు..

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు.
- బల్మూర్‌లో మూడు నావీ రహదారి పనులకు శంకుస్థాపన..




**బల్మూర్, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో రూ.146.71 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు కీలక నావీ రహదారి పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.వనపర్తి-1 ప్యాకేజీ, అచ్చంపేట ఫేజ్-1లో చేపట్టనున్న ఈ పనులతో ప్రాంతంలో రహదారి కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది.

**మూడు ప్రధాన పనులు:** రూ.32.99 కోట్లతో అమ్రాబాద్-తొల్పలపల్లి రహదారి బలోపేతం.- రూ.35.71 కోట్లతో బల్మూర్-నాగర్‌కర్నూల్ గ్రాణ రహదారి రెండు లేన్లుగా విస్తరణ.

- రూ.78.01 కోట్లతో అచ్చంపేట-రాకొండ రహదారి రెండు లేన్లుగా విస్తరణ.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో అచ్చంపేట ప్రాంత అభివృ ద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కోమ టిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపా రు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల కోసం సీఎం కేంద్రంతో నిరంతరం చర్చిస్తు న్నారని పేర్కొన్నారు.బుల్లెట్ ట్రైన్, శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, సోమశిల వంతెన వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు భవిష్యత్‌లో ఈ ప్రాంత రవాణా, కనెక్టివిటీని మరింత బలోపేతం చేయనున్నాయని మంత్రి వెల్లడించారు.

## వనమహోత్సవం-2026 లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి..

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లకు వెల్లడి.
- అటవీ,పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం-2026 కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అటవీ , పర్యావరణ , దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం రోజు రాష్ట్ర మంత్రి ఛాంబర్ నుండి , హైదరాబాద్ నుండి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు , జిల్లా అటవీ అధికారులతో వన మహోత్సవం-2026 లక్ష్యసాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ , పర్యా వరణ , దేవదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 56 శాతం లక్ష్యాలను పూర్తి చేయడం జరిగిందని , కేటాయించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని తెలి పారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారు లు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోటు వర్షా భావ పరిస్థితుల దృష్ట్యా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేక పోయా మని , ఇక నుండి కురిసే వర్షాల నీటిని ఒడిసిపట్టి, నిల్వచేసి సెప్టెంబర్ చివరి వారం లోగా 100 శాతం లక్ష్యా లను సాధిం చాలని తెలి పారు.




అటవీ శాఖ నర్సరీలలో తగినన్ని మొక్కలు అందు బాటులో ఉన్నాయని, గుర్తించ బడిన ప్రాంతాలలో ఎంపిక చేసిన మొక్కలు నాటాలని తెలిపా రు. మొక్క లను నాటడమే కాకుండా సంరక్షణ కూడా చేపట్టాలని , నాటిన ప్రతి మొక్క బ్రతికేలా చూడాలని , పశువులు , జంతువుల నుండి కాపాడేం దుకు నాటిన మొక్కలకు ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అర్బన్ ఫారెస్ట్ లలో విరివిగా మొక్కలు నాటాలని , మున్సిపాలిటీ ల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలని , దేవాల యాల ప్రాంగ ణాలలో ప్రత్యేకమైన ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీశాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. వన మహో త్సవం లక్ష్యాలను పూర్తి చేయడంలో భాగంగా ప్రజలందరికీ తెలిసే విధంగా మీడి యా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్ రెడ్డి , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కారం పరిష్కరించాలి..

- ఆర్డీవో రమణారెడ్డి..



**మిర్యాలగూడ, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఆర్డిఓ ఎస్.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన డివిజన్ స్థాయి ప్రజావాణిలో సుమారు 26 ఫిర్యాదులు అందాయి. ఇందులో మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయం 5, మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంకు 10, వేములపల్లి తహసీల్దార్ 1, దామరచర్ల తహసీల్దార్ 2, మాడ్గులపల్లి తహసీల్దార్ 1, త్రిపురారం తహసీల్దార్ 1, తిర్మలగిరి సాగర్ తహసీల్దార్ 1,డివిజనల్ పంచాయతీ అధికారి 1, మిర్యాలగూడ మున్సిపాలిటీ 1, సబ్ డివిజనల్ పోలీస్ 1, తహసీల్దార్ నిడమనూర్ ఒక, ఎంపిడిఓ మిర్యాలగూడ 2,ఫిర్యాదు స్వీకరించారు. వెంటనే సంబంధిత అధికారులకు సత్వర పరిష్కారం చేయాలని ఆర్డిఓ అందజేశారు. ప్రజావాణిలో డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.జగదీశ్వర్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి నసీమా మెహ్రిన్, ఎక్సైజ్ ఎస్ఐ షేక్ పర్వీన్, ఐసిడిఎస్ దామరచర్ల ప్రాజెక్టు ఆఫీసర్ శాంతి, మునిసిపల్ రెవిన్యూ ఆఫీసర్ కళ్యాణి, గ్రామీణ పేదరిక నిర్మూలన ఎపిడి బాలకృష్ణ, ఐసిడిఎస్ సూపర్ వైజర్, నీటిపారుదల శాఖ డిఇఇలు ఎండి.అహ్మదుల్లా, జనార్దన్, బిక్షం, ఆర్ అండ్ బి ఎఇ సతీష్, విద్యుత్ సబ్ ఇంజనీర్ నవిన్, హెచ్ డబ్ల్యూఓ జానిమియా, ఎస్టీ వెల్ఫేర్ రమేష్, బిసి వెల్ఫేర్ రాకేష్ పాల్గొన్నారు.

## స్కౌట్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్- 2026..

**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** పియం శ్రీ కేంద్రీయ విద్యాలయ భువనగిరి వేదికగా తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్-2026-27 (స్కౌట్స్) ఘనంగా ప్రారంభమైంది. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ఈ మూడు రోజుల శిబిరం ఆగస్టు 24 నుండి 26, 2026 వరకు కొనసాగుతుంది. హైదరాబాద్ రీజియన్‌కు చెందిన వివిధ కేంద్రీయ విద్యాలయాల స్కౌట్స్ ఈ శిబిరంలో పాల్గొన్నారు. అధికారిక ఉత్తర్వుల ప్రకారం కే.వి.ఎస్. హైదరాబాద్ రీజియన్ కు చెందిన తెలంగాణ రాష్ట్ర వివిధ కేంద్రీయ విద్యాలయాల స్కౌట్స్‌కు పియం శ్రీ కేంద్రీయ విద్యాలయ భువనగిరిని వేదికగా నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్. శ్రీనివాసులు , ప్రిన్సిపాల్ , పియం శ్రీ కేంద్రీయ విద్యాలయ నల్గొండ హాజరై స్కౌట్స్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. స్కౌటింగ్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ , సేవాభావం , నాయకత్వ లక్షణాలు , సమయపాలన బాధ్యతాయుతమైన పౌరసత్వ లక్షణాలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. వేదిక డైరెక్టర్‌గా ఎన్. చంద్ర మౌళి , పియంశ్రీ కేంద్రీయ విద్యాలయ భువనగిరి శిబిర నిర్వ హణను పర్యవేక్షిస్తున్నారు. శిబిరానికి విచ్చేసిన స్కౌట్స్, ఎగ్జామినర్లు , ఎస్కార్ట్ టీచర్లు క్యాంప్ అధికారు లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తూ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయం చేస్తున్నారు. శిబిరానికి క్యాంప్ లీడర్ (ఎల్ఓసి) శ్రీ ఆర్. జగన్మోహన్ రావు , ఏఎల్టి (ఎస్) నాయకత్వం వహిస్తున్నారు. అధికారిక వివరాల్లో భువనగిరి వేదికకు ఆయనను ఎల్ఓసి గా పేర్కొన్నారు. వివిధ కేంద్రీయ విద్యాలయాల నుండి నియమించబడిన ఎగ్జామినర్లు కూడా శిబిరంలో పాల్గొని స్కౌట్స్ తృతీయ సోపాన్ నై పుణ్యాలను పరీక్షి స్తున్నారు. ఈ శిబిరంలో ఎగ్జామినర్లు , టెస్టింగ్ ఇన్‌చార్జీలు, ఎస్కార్ట్ టీచర్లు, స్కౌట్ మాస్టర్లు స్కౌట్స్ చురుకుగా పాల్గొంటున్నారు. శిబిరం సజావుగా సాగేందుకు పియం శ్రీ కేంద్రీయ విద్యాలయ భువనగిరి బోధన బోధనేతర సిబ్బంది ఎంతో ఉత్సాహంతో పాల్గొంటూ వసతి , భోజనం, శుభ్రత, భద్రత, ప్రాంగణ ఏర్పాట్లు ఇతర అవసరమైన సౌకర్యాలను సమన్వయంతో అందిస్తున్నారు. శిబిరంలో పాల్గొంటున్న స్కౌట్స్‌లో క్రమశిక్షణ, సమయపాలన, సేవా భావం, నాయకత్వ లక్షణాలు జట్టు స్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తున్నాయి. శిబిరాన్ని విజయవంతం గా నిర్వహించేందుకు నిర్వాహకులు , ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది సమిష్టిగా కృషి చేస్తున్నారు. ఈ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ విద్యార్థుల్లో దేశభక్తి , సేవా దృక్పథం , నాయకత్వ లక్షణాలు బాధ్యతా యుతమైన పౌరసత్వాన్ని పెంపొందించడంలో ఎంతో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.





# కేంద్రం ముందు మోకరిల్లిన రేవంత్ సర్కార్..

- ప్రీపెయిడ్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్ల ఏర్పాటు నిర్ణయం ఉపసంహరించుకోవాలి..
- డిమాండ్ చేసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత..





**హైదరాబాద్, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ముందు రేవంత్ రెడ్డి సర్కారు మోకరిల్లిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ఉచిత కరెంట్ ను ఎత్తివేసే కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు. సోమవారం ఈమేరకు వీడియో సందేశం రిలీజ్ చేశారు. అనంతరం పీపుల్స్ ప్లాజాలో టీజీఎస్పీడీసీఎల్ ఏర్పాటు చేసిన పవర్ ఎక్స్ పో -- 2026ను సందర్శించి అక్కడ ప్రదర్శనకు ఉంచిన స్మార్ట్ మీటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంట్ ను దూరం చేయడంతో పాటు లాండ్రీ షాపులు, సెలూన్లకు ఉచిత కరెంట్ ఎత్తివేసే కుట్రలో భాగంగానే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పథకంలో భాగంగానే రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. గతంలో వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రయత్నం రేవంత్ సర్కారు చేసిందన్నారు. అదానీకి లాభం చేయడానికి కేంద్రం స్మార్ట్ మీటర్లు ప్రవేశ పెడుతుంటే రేవంత్ సర్కారు దానికి వంత పాడుతోందన్నారు. దీనిపై ప్రజల మైండ్ వాష్ చేసేందుకే పీపుల్స్ ప్లాజాలో ప్రదర్శన ఏర్పాటు చేసిందన్నారు. ఈఆర్సీ వద్ద రైతులు గొడవ చేస్తే వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని చెప్పారని.. గృహ విద్యుత్ కనెక్షన్లకు మాత్రం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని ఇటీవల ట్రాన్స్ కో సీఎండీ చెప్పారని గుర్తు చేశారు. సెల్ ఫోన్ ముంద స్తుగా రీచార్జ్ చేసుకున్నట్టుగా ఇకపై కరెంట్ కు ముందస్తు చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి స్మార్ట్ మీటర్లతో వస్తుందన్నారు. రీచార్జ్ ఎప్పుడు అయిపోతే అప్పుడు ఆటోమేటిక్ గా ఇండ్లలో కరెంట్ కట్ అవుతుందని చెప్పారు. యూపీలో స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్లు ఏర్పాటు చేస్తే ప్రజలు ఆగ్రహంతో వాటిని తొలగించి కరెంట్ ఆఫీసుల్లో పడేసి వెళ్తున్నారని అన్నారు.

ఇప్పుడున్న మీటర్లతోనే కరెంట్ సరఫరా చేయాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ లు, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసి కరెంట్ సరఫరా బాగుండేలా చర్యలు చేపట్టాలని కోరారు. మన కరెంట్ ను అదానీ చేతుల్లో పెట్టే ప్రయత్నాలను ఇకనైనా విరమించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తెలంగాణ రక్షణ సేన వ్యతిరేకిస్తుందని.. ప్రజల కోసం ప్రజాక్షేత్రంలోకి వచ్చి ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

**అవినీతి అధికారులు సరే..**
**అవినీతికి మూలకారకుల సంగతేంది? :**

గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడి రూ.వేల కోట్లు కొల్లగొట్టిన అధికారుల గుట్టును ఏసీబీని ఉపయోగించి బయట పెడుతున్న ప్రభుత్వం ఆ అవినీతికి మూల కారకుల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు.

ఈమేరకు ఎక్స్ (ట్విట్టర్)లో సోమవారం పోస్ట్ పెట్టారు. గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో అధికా రులు వందలు, వేల కోట్ల ప్రజాధనం దోచుకోవడానికి వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్న వారి సంగతి ఏమిటని ప్రశ్నించారు. అధికారులను ముందు పెట్టి రూ.వేల కోట్లు దోచు కుంటున్న వారి నుంచి ఆ అవినీతిని సొమ్ము కక్కించే వాళ్లు ఎవరు అని నిలదీశారు.

అవినీతికి అధికారులను బాధ్యులను చేస్తున్నారని.. వారిని అడ్డుపెట్టుకొని వ్యవస్థలను దోపిడీ చేసే వారిని కట్టడి చేయాల్సిన వాళ్లెవరని ప్రశ్నించారు. తమకు మంచి చేస్తారని నమ్మి ప్రజలు అధికారం ఇస్తే భవిష్యత్ తరాలకు చెందాల్సిన సంపదను కొల్లగొడుతున్న వారిని చూస్తూ ఊరుకోవాలా అని నిలదీశారు. తన ప్రశ్నలపై పౌర సమాజం సీరియస్ గా చర్చించాలని విజ్ఞప్తి చేశారు.

# చిరుతపులి చర్మం, గోర్ల అక్రమ విక్రయం

- విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులు అరెస్టు



**కొత్తగూడెం ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌పరిధిలో చిరుతపులి చర్మం, గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులను బూర్గంపాడు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు జిల్లాఎస్పీ రోహిత్‌రాజు సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వివరాలువెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఇ.నాగభిక్షం, టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం తాళ్లగొమ్మూరు గ్రామంలో అనీల్ ఇంటి వద్ద ఒక చిన్నబ్యాగ్‌తో అనుమానా స్పదంగా ఉన్న నలుగురువ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకోని విచారించినట్లు తెలిపారు.

విచారణలో నిందితులు గత సంవత్సరం వేసవికాలంలో చింతూరు మండల గమ్మలకోట గ్రామానికి సమీపంలోని అటవీప్రాంతంలో గుంతలో పడిపోయి బయటకు రాలేని పరిస్థితిలోఉన్న చిరుతపులినిరాళ్లు, కర్రలతో కొట్టి, బాణాలు విసిరిచంపినట్లు తెలిపారు. అనంతరం దాని చర్మం, గోర్లను తొలగించి, చర్మాన్ని ఎండబెట్టి,గోర్లను భద్రపరిచి ఉంచి, తరువాత పులిచర్మం, గోర్లను విక్రయించి డబ్బు సపాదించాలని ప్రయత్నిస్తుండగా సారపాకకు చెందిన చల్లా అనిల్‌కుమార్ అనే వ్యక్తి భూమినికౌలుకు తీసుకుని వ్యవసాయం చేయడానికి గమ్మలకోటగ్రామం, చింతూరుమండలంకుచెందిన కుంజా భద్రయ్య వద్దకు రాగా అతనిని సంప్రదించినట్లు తెలిపారు. అనిల్‌కుమార్ కొనుగోలుదారులను సంప్రదించి విక్రయానికి సహకరిస్తానని చెప్పడంతో కుంజా భద్రయ్య, కుంజాగంగరాజు,మడవి కన్నయ్య ముగ్గురు కలిసి చిరుతపులి చర్మం, గోర్లను ఒక చిన్న బ్యాగ్‌లో పెట్టుకోని తాళ్లగొమ్మూరులోని అనిల్‌కుమార్ ఇంటికి తీసుకోచ్చినట్లు విచారణలో తెలిపారన్నారు. ఈక్రమంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకోని నిందితుల వద్ద చిరుతపులి చర్మం, 17గోర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారిలో అనిల్‌కుమార్, కుంజాభద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్యలు ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్, ఎస్బి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సిఐ సతీష్, టాస్క్‌ఫోర్స్ సిఐ రమాకాంత్, ఎస్ఐలు నాగభిక్షం, ప్రవీణ్, సుమన్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు .

# వివాహితను బెదిరించి లైంగికంగా వేధించిన వ్యక్తి అరెస్ట్

- నిందితుడిని అదుపులోకి తీసుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు..
- కోర్టులో హాజరుపరిచి రిమాండ్



**కరీంనగర్ (ప్రతినిధి, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఓ వివాహితను బెదిరిస్తూ లైంగికంగా వేధించిన ఆరోపణలపై ఓ వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని బొమ్మకల్ గ్రామం మధురానగర్‌కు చెందిన ఓ వివాహిత తన భర్త, పిల్లలతో కలిసి నివసిస్తోంది. సీతారాంపూర్‌కు చెందిన బైక్ మెకానిక్ మెడిదొడ్డి సాయికుమార్‌కు ఆమె కుటుంబంతో గత ఆరు నెలలుగా పరిచయం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు.ఈ పరిచయాన్ని ఆసరాగా చేసుకున్న సాయికుమార్ ఆమెతో తరచూ ఫోన్‌లో మాట్లాడటం, మెసేజ్‌లు చేయడం ప్రారంభించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం భర్త ఇంట్లో లేని సమయంలో ఆమె ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనతో మాట్లాడాలని, లేకపోతే చంపుతానని బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి పలుమార్లు బలవంతంగా లైంగికంగా వేధించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ విషయం భర్తకు తెలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరిస్తూ ఆమెను భయభ్రాంతులకు గురిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భార్య ప్రవర్తనపై అనుమానం వచ్చిన భర్త ఇంట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, సాయికుమార్ ఆమెను కలిసిన దృశ్యాలు కెమెరాల్లో నమోదైనట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో కుటుంబంలో వివాదం తలెత్తడంతో భర్త తన కుమారుడిని తన వద్ద ఉంచుకుని, కుమార్తెను భార్య వద్దకు పంపినట్లు తెలిసింది. అనంతరం భార్యకు న్యాయవాది ద్వారా కోర్టు నుంచి విడాకుల నోటీసు పంపించినట్లు పోలీసులు తెలిపారు.ఇదిలా ఉండగా సాయికుమార్‌ను ఈ వ్యవహారంపై ప్రశ్నించగా, తనకు అవసరమైనప్పుడు ఆమెను ఉపయోగించుకున్నానని, ఇకపై తన వద్దకు రావద్దని, ఎక్కడైనా చెప్పుకోవచ్చని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.దీంతో బాధితురాలు కరీంనగర్ రూరల్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బాధితురాలు, ఆమె భర్తతో పాటు ఇతర సాక్షులను విచారించిన పోలీసులు సీసీ కెమెరా దృశ్యాలను సేకరించారు.నిందితుడు సాయికుమార్ పరారీలో ఉండగా, గణేశ్‌నగర్‌లోని తన బైక్ మెకానిక్ షాపు వద్ద ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని సాయికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.బాధితురాలికి అవసరమైన సహాయం అందించేందుకు కరీంనగర్‌లోని భరోసా సెంటర్‌కు పంపించడంతో పాటు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

## రైతులు వరి సాగు వివరాలు నమోదు చేసుకోవాలి

- ఏఓ రామడుగు వాణి




**పాలేరు ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం సూచించిన 7 రకాల వరి సాగు విస్తీర్ణాలను సెప్టెంబర్ 10 వ తేదీ లోపు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కూసుమంచి మండల వ్యవసాయాధికారిణి రామడుగు వాణి రైతులకు సూచించారు.

**ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..**

డీలర్ వద్ద ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల విత్తనాలు అయినటువంటి బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, డబ్ల్యూజిఎల్ 44, కెఎన్ఎం 1638, కెఎన్ఎం 7715, జై శ్రీరామ్, హెచ్ఎంటి సోనా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్,విత్తనాల కొనుగోలు బిల్లు తీసుకుని, కొనుగోలు చేసిన సంబంధిత డీలర్ వద్ద పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.సొంత విత్తనం లేదా ఇతర రైతుల నుంచి పొందిన విత్తనాలను వినియోగించే రైతులు రైతు ధృవీకరణ పత్రంతో పాటు సంబంధిత వివరాలను తమ క్లస్టర్ పరిధిలోని ఏఈఓ కి సమర్పించాలని సూచించారు.నమోదు చేసిన వివరాలను సివిల్ సప్లైస్ శాఖకు అందజేయడం జరుగుతుందని, పోర్టల్‌లో నమోదు చేసుకున్న రైతులే వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు,క్వింటాల్‌కు రూ.500 బోనస్ పొందేందుకు అర్హులు అవుతారని ఆమె తెలిపారు.కావున కూసుమంచి మండలంలోని వరి సాగు చేస్తున్న రైతులందరూ నిర్ణీత గడువులోగా తమ పంట వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని వాణి సూచించారు.

## మైనారిటీలు, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి కమిటీలు కీలకం

- పథకాలు అర్హులందరికీ చేరేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి: గుత్తా సుఖేందర్ రెడ్డి.



**నల్గొండ, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్, తెలంగాణ శాసనసభ స్పీకర్ ఛాంబర్‌లో శాసన మండలి, శాసన సభలకు సంబంధించిన మైనారిటీ సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసన సభ, శాసన మండలి సభ్యులు, కార్యదర్శులు నరసింహాచార్యులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.**

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసన కమిటీల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా కమిటీలు పనిచేయాలని సూచించారు.మైనారిటీలు, వెనుకబడిన తరగతుల ప్రజలకు విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కమిటీలు ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరుతున్నాయా లేదా అనే అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అమలులోని సమస్యలు, లోపాలను గుర్తించి ప్రభుత్వానికి తగిన సిఫారసులు చేయాలని తెలిపారు.శాసన మండలి, శాసన సభ సభ్యులు రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కమిటీల సభ్యులు తమ అనుభవం, అవగాహనతో మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి దోహదపడే సూచనలు అందించాలని ఆయన కోరారు.

## మహమ్మదాపురంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**పాలేరు, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద,అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ ఆహార భద్రతా పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందుతాయని తిరుమలాయపాలెం మండలంలోని మహమ్మదాపురం సర్పంచ్ బోడా మంజు రవి అన్నారు.గ్రామ పంచాయితీ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం ఆమె చేతుల మీదుగా గ్రామస్తులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు క్యూఆర్ కోడ్ కలిగి ఉంటాయని,క్యూఆర్ కోడ్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు,రేషన్ ద్వారా పొందిన సరుకుల వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.రేషన్ దుకాణంలో కార్డు నంబర్ లేదా క్యూఆర్ కోడ్ ఆధారంగా వివరాలను నమోదు చేసి, బయోమెట్రిక్ ధృవీకరణ అనంతరం సంబంధిత సరుకులు పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో జిపిఓలు నూరిన్నిసా బేగం, నాగుల్ మీరా,వార్డు సభ్యులు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి:పాగర్తి సుధాకర్



**పాలేరు, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు.మండలంలోని చెరువు మాదారం గ్రామంలో సోమవారం భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణం పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువవ్వాలన్నారు.అదే విధంగా ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలో ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిజెపి అధికార ప్రతినిధి సూరేపల్లి జ్ఞానరత్నం,గ్రామ నాయకులు కొండా హర్షవర్ధన్,గెల్లా చక్రపాణి, ఏపూరి సత్యనారాయణ, జెల్లా సురేష్,బిజెపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు .

## గూడెం యువజనకమిటీ ఎంపిక

- పట్టణాధ్యక్షులుగా పల్లా దేవి వరప్రసాద్
- అభినందనలు తెలిపిన సీతారాములు, దామోదర్ యాదవ్



**కొత్తగూడెం, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్తగూడెంపట్టణంలో యాదవ పెద్దల సమక్షంలో పట్టణయువజన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి జనరల్‌సెక్రటరీ నాగా సీతారాములుయాదవ్, మున్సిపల్‌మాజీ వైస్‌చైర్‌పర్సన్ వేల్పుల దామోదర్‌యాదవ్ హాజరై నూతనంగా ఎన్నికైన యాదవ యువజన కమిటీని ప్రత్యేకంగా అభినందిచారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మీరుయాదవులకు దిక్సూచిగా నిలబడాలని సూచించారు. పట్టణయాదవ యువజన కమిటీ అధ్యక్షులుగా పల్లాదేవి వరప్రసాద్‌యాదవ్, ఉపాధ్యక్షులు అద్దాల అశోక్‌యాదవ్, ఆవాలసునీల్‌యాదవ్, సురిమినేని హరీష్‌యాదవ్, కార్యదర్శులుగా అమృతవల్లి ప్రవీణ్‌యాదవ్, బైకాను హరిప్రసాద్‌యాదవ్, ముత్యాల అజయ్‌యాదవ్, కోశాధికారిగా మీసా వేణుయాదవ్, సహాయ కోశాధికారిగా మామిడి శ్రీనివాస్‌యాదవ్, కార్యవర్గసభ్యులుగా కొంచెం సందీప్‌యాదవ్ కార్యవర్గసభ్యులు జునుమాల వంశీ, జడల మధుబాబు, కంచం సందీప్‌లను ఎంపికచేశారు.ఈ కార్యక్రమంలో యాదవ కుల పెద్దలు కోదాడ శ్రీనివాస్‌యాదవ్, కౌడగానిశ్రీనివాస్‌యాదవ్, చిలక రవియాదవ్,వేల్పుల కుమార్‌యాదవ్, అంబుల వేణుయాదవ్, బమ్మిడి రమాకాంత్‌యాదవ్, సమ్మయ్య యాదవ్, జడల నానియాదవ్ తదితరులు పాల్గొన్నారు .

## జిల్లా పర్యటనకు వచ్చిన హుస్సేన్‌కు ఘనస్వాగతం పలికినకలెక్టర్



**కొత్తగూడెం, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా పర్యటనకు వచ్చిన నేషనల్ కమిషనర్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ గౌరవాధ్యక్షులు జాటోత్ హుస్సేన్‌కు సింగరేణి గెస్‌హౌస్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పూల మొక్కను అందించిగౌరవ సభ్యులను సాదరంగా ఆహ్వానించారు. జిల్లాలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి,వారికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. జిల్లాలో గిరిజనప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వంచేపడుతున్న కార్యక్రమాలు, గిరిజనులకు మెరుగైన మౌలిక వసతులు, విద్య,వైద్యం, తదితర రంగాల్లోఅందిస్తున్న సేవలపై అధికారులు వివరించారు.ఈకార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజు, ఐటిడిఏ పిఓ రాహుల్, జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థవిక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు .

## మండల ప్రజావాణికి 8 దరఖాస్తులు



**ఓదెల, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 8 దరఖాస్తులు అందాయి. వీటిలో గృహ నిర్మాణానికి సంబంధించి 3, విద్యుత్ 2, అటవీ శాఖకు 1, ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించి 2 దరఖాస్తులు వచ్చాయి. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన అర్జీలను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకుపంపించారు.కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్‌రెడ్డి, తహసీల్దార్ వనజానాయక్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు

## ప్రజావాణికి 15 ఫిర్యాదులు

**కోహెడ, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :** కోహెడ మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 15 ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. వీటిలో ఎంఆర్ఓకు 9, ఎంపీడీవో, ఏపీఓ, ఎంఏఓ, ఎంపీఓ, ఏఈ హౌసింగ్, పీహెచ్సీ మెడికల్కు ఒక్కో దరఖాస్తు చొప్పున వచ్చాయి. ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి, సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

## - లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన సర్పంచ్ పసుల కార్తీక్



**జేడీ మల్లంపల్లి, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**
అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని మహ్మద్ గౌస్ పల్లి సర్పంచ్ పసుల కార్తీక్ అన్నారు. మల్లంపల్లి మండలం మహ్మద్ గౌస్ పల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ పాలన అధికారి వినీత అధ్యక్షతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పసుల కార్తీక్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు అందిస్తోందని, పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతనిప్పుల రఘు, వార్డు సభ్యులు విజయ్, అశోక్, సునీత, సుమలత, లక్ష్మణ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు కుమారస్వామి, మొగిలి, రాజేందర్, బిక్షపతి, రవిశంకర్, తిరుపతి, సురేష్, రజనీకర్, రమేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల పైప్‌లైన్‌ను జాకారం ఊర చెరువుకు అనుసంధానించాలి

## - అడిషనల్ కలెక్టర్‌కు జాకారం రైతులు,నాయకుల వినతి



**ములుగు, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**
జాకారం గ్రామంలోని ఊర చెరువుకు దేవాదుల పైప్‌లైన్‌ను తక్షణమే అనుసంధానం చేసి సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జాకారం గ్రామ రైతులు,నాయకులు ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీకి వినతిపత్రం సమర్పించారు.మాజీ సర్పంచ్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి గ్రామంలోని సాగునీటి సమస్యలను వివరించారు.జాకారం శివారు ప్రాంతం మీదుగా దేవాదుల ప్రధాన పైప్‌లైన్ వెళుతున్నప్పటికీ, సమీపంలోని ఊర చెరువుకు నీటిని మళ్లించే అవకాశం లేకపోవడంతో పంట పొలాలు సాగునీరు లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదుల పైప్‌లైన్‌ను ఊర చెరువుకు అనుసంధానం చేస్తే చెరువుతో పాటు దిగువన ఉన్న లోకం చెరువు కూడా పూర్తిస్థాయిలో నిండుతుందని తెలిపారు. దీంతో చుట్టుపక్కల వ్యవసాయ భూములకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.రైతుల సమస్యను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పైప్‌లైన్ అనుసంధాన పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో దేవునూరి రమేష్, బండారి రమేష్, ఈర్ల చంద్రసేన, మ్యాదరి రాజేందర్, అన్నబోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా సత్యం



**తాండూర్, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**
మంచిర్యాల జిల్లా తాండూర్ మండల ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులుగా కుమ్మరి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాండూర్ మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో ఈ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు అనుమాండ్ల విక్రమ్ ఆధ్వర్యంలో తాండూర్ మండల ఉప సర్పంచ్ ల ఫోరంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కుమ్మరి సత్యనారాయణ, ఉపాధ్యక్షురాలిగా బొయిని సుమలత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సత్యనారాయణ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఉప సర్పంచ్ లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఫోరం బలోపేతానికి పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండలంలోని పలు గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు.

# పంచాయతీల ప్రగతికి పకడ్బందీ ప్రణాళిక

## :రామాజీపేట్‌లో ఎంపీడీఓ చిరంజీవి తనిఖీ..

### అధికారులకు కీలక ఆదేశాలు



**రాయికల్, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**
గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధితో పాటు పాలనలో పారదర్శకత, ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని రాయికల్ ఎంపీడీఓ బింగి చిరంజీవి సూచించారు. రామాజీపేట్ గ్రామ పంచాయతీని సందర్శించిన ఆయన అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీ శాప్)కు సంబంధించిన వివరాలను రెండు రోజుల్లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గత మూడేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు పంచాయతీ ప్రొఫైల్, ఇతర వివరాలను నమోదు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. తద్వారా పాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని తెలిపారు. 2026-27 సంవత్సరానికి సంబంధించిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ), 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగ ప్రణాళికలను మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ అవసరాలు, ప్రజల ప్రాధాన్యతలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ మొబైల్ అనుసంధానం గ్రామంలోని ప్రతి ఇంటి నంబర్‌కు కుటుంబ సభ్యుల మొబైల్ నంబర్‌ను అనుసంధానం చేయాలని సూచించారు. దీనివల్ల ఇంటి పన్ను, మ్యుటేషన్‌తో పాటు ఇతర పంచాయతీ సేవలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు సకాలంలో చేరవేయవచ్చని తెలిపారు.పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి వీధులు, డ్రైనేజీలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం తాగునీటి వనరులు, అవసరమైన ప్రాంతాల్లో క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. జలసిరి కార్యక్రమం కింద పంటకుంటలు, ఇంకుడు గుంతలు, ఊటకుంటల నిర్మాణ పనులను వేగవంతం చేసి వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ సుష్మా, సర్పంచ్ మోహన్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిన్నారం పోచమ్మ గుడికి 12 లక్షల భారీ విరాళం

## దైవ కార్యానికి దాతృత్వ హస్తం అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్..

**జిన్నారం, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**
జిన్నారం మున్సిపల్ లోని ఒక వైపు ప్రజాసేవలో.. మరో వైపు భక్తి సేవలో తనదైన ముద్రను చాటుతున్నారు ఎమ్మెల్యేగూడెం మహిపాల్ రెడ్డి పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా పరమతసహనం పెంపొందిస్తూ.. సొంత నిధులతో గుడులు, మసీదులు, చర్చిలు నిర్మిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందిస్తున్నారు.

తాజాగా.. జిన్నారం మున్సిపల్ కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి 12 లక్షల రూపాయల భారీ విరాళం అందించి తన దైవభక్తిని మరోమారు చాటుకున్నారు.

సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి ఆలయ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించి.. ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా భక్తి ప్రపత్తులతో నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవభక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజాసేవను తన బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా.. ప్రజలను ఐక్యం చేసే సామాజిక వేదికలని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సొంత నిధులతో నియోజకవర్గం వ్యాప్తంగా 200 లకు పైగా దేవాలయాలు, మసీదులు, ఆశీర్ఖానాలు, చర్చీలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

నిరంతరం ఆధ్యాత్మికతను ప్రోత్సహించడంతో పాటు ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్ సేవా కార్యక్రమాలు ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.







# డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్





జమ్మికుంట పట్టణ పరిధిలోని కస్తూరిబా పాఠశాల సమీపంలో గల డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ గారు మరియు కౌన్సిలర్లు

**జమ్మిగుంట, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**
జమ్మికుంట పట్టణ ప్రజలందరికీ కూడా నమస్కారం ఈరోజు ని కేశవపురం కస్తూరిబా స్కూల్ దగ్గర ఉన్నటువంటి కొన్ని డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలించడానికి రావడం జరిగింది. ఎందుకంటే ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పంపిణీలో లబ్ధిదారులందరినీ కూడా సెలెక్ట్ చేసే పరిస్థితి ఉంది ప్రజలందరు కూడా అక్కడ ఇండ్లన్ని పూర్తి అయిపోయినాయి మాకు మంజూరు చేసినటువంటి పత్రాలు ఇస్తే దానిలో పోయి నివాసంగా ఉండొచ్చు అని అనుకుంటున్నారు ఈరోజు జమ్మికుంటకు మొత్తం కూడా 500 డబుల్ బెడ్‌రూమ్‌లు అప్పుడు ఉన్నటువంటి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వమే ఇది నిర్మాణం మొదలుపెట్టి పూర్తి అయ్యే దశలో ప్రభుత్వము మారడం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ కొద్దిరోజులకే గత ప్రభుత్వం చేసినటువంటి తప్పులను గాని మేము ఏం చేయము మీకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వలేదు అని చెప్పి మూడు సంవత్సరాలు పూర్తి కావస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఈరోజు ప్రభుత్వానికి జమ్మికుంట మున్సిపల్ కౌన్సిల్ తరఫున ఒక విజ్ఞప్తి, ప్రజలను ఎవరినీ కూడా ఎవరూ మోసం చేయొద్దు ఏ ప్రభుత్వం అయినా కూడా ప్రజలకి మెరుగైన సదుపాయాలు ఉండడానికి ఒక మంచి ఇల్లు అనే ఒక పథకాన్ని తీసుకొచ్చినటువంటి ఏ ప్రభుత్వానైనా ప్రజలు ఆదరిస్తారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వం ప్రారంభించినటువంటి 2 బి. హెచ్. కె ని ఈరోజు పంచడానికి హడావుడి మేము గెలిచి ఇప్పుడు ఆరు నెలల కాలం పూర్తొస్తుంది,ఆరు నెలల నుంచి ఇగో రేపు, ఇగో రేపు,ఇగో రేపు అని చెప్పి వాళ్ళు ప్రచారాలు చేస్తున్నారు నిన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు కూడా గౌరవనీయులు గృహనిర్మాణ శాఖ మంత్రి కూడా తప్పకుండా ప్రజలకు మిగిలిన ఏదైతే రిమైనింగ్ వర్క్ అక్కడ పెండింగ్ ఉందో, ఆ యొక్క లబ్ధిదారునికే మేము నగదు ఇచ్చి ఆ కన్‌స్ట్రక్షన్ పూర్తి చేస్తాము ఉదాహరణకి జమ్మికుంటలో 500 ఇండ్లు ఈరోజు ఇక్కడి నుంచి మేము జిల్లా కలెక్టర్ గారికి మరియు ఇక్కడున్నటువంటి మంత్రులకి, ఇక్కడున్నటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి రాజకీయ విమర్శలు మాకు అవసరం లేదు ఇక్కడున్నటువంటి మీరు ఎవరికైతే లబ్ధిదారులకి ఇస్తా అన్నారో, ఒక్కసారి ఆ లబ్ధిదారులని మీరు మంజూరు చేసిన లబ్ధిదారులను ఒక్కసారి ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లని వాళ్ళనే పరిశీలించమనండి,లేదంటే మీరు కూడా రండి లేదు ఇక్కడ ఎంత ఖర్చు అవుతది,ఎంత నిధులు కేటాయిస్తే ఈరోజు ఈ డబుల్ బెడ్‌రూమ్‌లు అన్నీ పూర్తి కావస్తాయి ఈరోజు ప్రజలకి అబద్ధాలు చెప్పుకుంటూ ప్రజలని ఆశగా ఎదురుచూసే విధంగా ప్రభుత్వాలు చేయొద్దు దయచేసి జిల్లా కలెక్టర్ గారు, స్థానికంగా ఉన్నటువంటి మున్సిపల్ కమిషనర్ గారు,హౌసింగ్ పీడీ గారు ఎంతసేపూ ఇక్కడ 240 ఇండ్లు ఉన్నాయి అని చెప్పి కస్తూరిబా స్కూల్ దగ్గరనే ఇక్కడ నిర్మాణ దశలో రేపు పొద్దున వచ్చి నివాసయోగ్యంగా ఉండడానికి ఉన్న ఇండ్లు మాత్రము 24 ఇండ్లు మాత్రమే నివాసయోగ్యంగా రేపు పొద్దున వచ్చి ఊడ్చుకొని కిటికీలో దర్వాజాలో పెడితే ఉండొచ్చు మిగతావన్నీ ఒకటేమో ఫౌండేషన్ స్టేజ్‌లో ఉంది, ఒకటేమో పిల్లర్ స్టేజ్‌లో ఉంది, ఒకటేమో జి +1 కట్టి జి +2 పెండింగ్‌లో ఉన్నది లోపట ఇక్కడున్నటువంటి మెటీరియల్‌ని కన్‌స్ట్రక్షన్ అంతా కూడా గుర్తితెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు అంటే పూర్తిగా కూడా శిథిలంలో అంటే ఇక్కడ ఎవరూ నివసించే పరిస్థితి లాగా కనబడడం లేదు. దయచేసి జిల్లా కలెక్టర్ గారు సంబంధిత అధికారులతో సమాచారం తెలుసుకున్న తర్వాత డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమం చేయగలరని తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ శీలం శ్రీనివాస్, కొలుగురి సురేష్, ఫిరోజ్, మైస రవి,పరశురామ్,శంకర్,శివ తదితరులు పాల్గొన్నారు..

# నూకపల్లి డంపింగ్ యార్డుపై సమగ్ర విచారణ జరపాలి

**జగిత్యాల, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**
జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని నూకపల్లి డంపింగ్ యార్డులో చేపట్టిన బయోమైనింగ్ పనులు, బిల్లుల చెల్లింపులు, అవినీతి ఆరోపణలు, అలాగే డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ, దుర్వాసనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీట్ బజార్‌కు చెందిన సత్యం జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. బయోమైనింగ్ పనులు పూర్తిస్థాయిలో జరగకపోయినా పూర్తయినట్లు చూపించి సుమారు రూ.1.20 కోట్ల మేర బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయని, టెండర్ ఒప్పందం, వర్క్ ఆర్డర్, ఎంబీ, పరిమాణ రికార్డులు, వెయ్‌బ్రిడ్జి స్లిప్పులు, వాహనాల ట్రిప్‌షీట్లు, బిల్లులు, జియో ట్యాగ్డ్ ఫొటోలు తదితర రికార్డులను క్షేత్రస్థాయి పనులతో సరిపోల్చి సాంకేతిక ఆడిట్ నిర్వహించాలని కోరారు. అలాగే బయోమైనింగ్ వ్యవహారంలో ఓ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రూ.20 లక్షలు నగదు తీసుకున్నారనే ఆరోపణలపై పత్రికా కథనాలు, అధికారిక ఫైళ్లు, చెల్లింపు రికార్డులు, సంబంధితుల వాంగ్మూలాలను పరిశీలించి స్వతంత్ర విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీకి సమీపంలో డంపింగ్ యార్డు ఉండటంతో పొగ, దుర్వాసన కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, శ్వాస సంబంధిత సమస్యలున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడంతో పాటు డంపింగ్ యార్డు పరిసరాల్లో గాలి నాణ్యత, పొగలోని కాలుష్య కారకాలు, దుర్వాసనకు కారణమయ్యే వాయువులపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలని కోరారు.రికార్డుల్లో చూపిన బయోమైనింగ్ పరిమాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైతే డ్రోన్ సర్వే, జియో ట్యాగింగ్ ద్వారా పనుల వాస్తవ స్థితిని నిర్ధారించాలని, అక్రమాలు రుజువైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రభుత్వానికి నష్టం వాటిల్లిన మొత్తాన్ని రికవరీ చేయాలని సత్యం కోరారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డులో పొగ, దుర్వాసన సమస్యకు తక్షణ, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.




# SIR ఫేజ్ 2 పై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష

**రామ్‌మందిర్ ఏరియా, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**
రామగుండం: SIR ఫేజ్2 ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో SIR ఇన్‌చార్జీలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా SIR ఫేజ్2 ప్రక్రియలో ఇప్పటివరకు జరిగిన పురోగతి, చేపట్టాల్సిన చర్యలు, ఎదురవుతున్న సమస్యలపై ఎమ్మెల్యే సమీక్షించారు. ప్రక్రియను నిర్ణీత సమయంలో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత సిబ్బంది, ఇన్‌చార్జీలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ SIR ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రామగుండం నగర పాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, SIR ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.





# ఆరు నెలల చిన్నారికి అన్నప్రాసన - తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన



**రాయికల్, ఆగస్టు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**
చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని అంగన్వాడీ సూపర్వైజర్ పద్మావతి అన్నారు. రాయికల్ పట్టణంలోని 5వ వార్డులో గల రెండో అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ఆరు నెలలు నిండిన జక్కుల విహాన్‌కు బాలామృతంతో అన్నప్రాసన నిర్వహించారు.

ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ.. గర్భం దాల్చినట్లు తెలిసిన వెంటనే అంగన్వాడీ సేవల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. గర్భిణీలు క్రమం తప్పకుండా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. బిడ్డ జన్మించిన వెంటనే ముర్రుపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని, శిశువుకు ఆరు నెలలు పూర్తయ్యే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని వివరించారు.

ఆరు నెలలు దాటిన తర్వాత అనుబంధ ఆహారాన్ని ప్రారంభించడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం అందిస్తున్నట్లు తెలిపారు.

అర్హులైన చిన్నారులకు నెలకు 16 కోడిగుడ్లతో పాటు బాలామృతం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రమాదేవి, పద్మ, ఉమాదేవి, తల్లులు, ప్రీ-స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.

## ఈ నెల 27న మంగళగిరి మోడల్ రైతు బజార్‌కు శంకుస్థాపన

- హాజరుకానున్న మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేయనున్న మంగళగిరి మోడల్ రైతు బజార్‌కు ఈ నెల 27న ఉదయం 9 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు, మంగళగిరి టౌన్‌లోని నిడమర్రు రైల్వే గేట్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.
రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొననున్నారు. రైతులకు తమ పంటలకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా మోడల్ రైతు బజార్‌ను అభివృద్ధి చేయనున్నారు.

## రూ.4 లక్షల ఎల్వోసీ అందజేత



- ఆసుపత్రికి వెళ్లి ఎల్వోసీని అందజేసిన నాయకులు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 4,00,000 విలువైన ఎల్వోసీని మంగళగిరి 27వ వార్డుకు చెందిన ఇర్ల వాసుదేవరావుకు నాయకులు అందజేశారు. ప్రస్తుతం ఎన్నారై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వాసుదేవరావును ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన నాయకులు, ఎల్వోసీని అందజేశారు.
ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "మంత్రి నారా లోకేష్ చొరవతో అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందుతోంది. వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. వాసుదేవరావు కుటుంబానికి కూడా రూ. 4 లక్షల ఎల్వోసీ మంజూరు కావడం సంతోషకరం. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలవాలన్నదే మంత్రి నారా లోకేష్ లక్ష్యం" అని అన్నారు.
ఎల్వోసీ మంజూరుకు సహకరించిన మంత్రి నారా లోకేష్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు చెప్పారు.
ఎల్వోసీ ని అందజేసిన వారిలో మంగళగిరి పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, మంగళగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి రాయపాటి విజయ్, గజ్జల వెంకట రమణ తదితరులు ఉన్నారు.

## ఈవీఎం గోడౌన్‌లను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా లోని ఈ.వి.యం గోడౌన్ లను జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక ఆర్ డి ఓ కార్యాలయం ఆవరణలో మరియు రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ఇ.వి.యం గోడౌన్ లను నెలవారీ తనిఖీలలో భాగంగా పరిశీలించారు.
ఈవీఎంలు భద్రపరిచిన గదుల వద్ద భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, గోడౌన్ తాళాలు, సీల్‌లను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలన్నారు.
ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా కళాశాల అభివృద్ధి నా బాధ్యత : ఎమ్మెల్యే నసీర్

- ఐదేళ్లలో మహర్దశ తీసుకొస్తాం
- మహిళా విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం
- రూ.31 లక్షలతో ఇంటర్ కళాశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మంత్రి నారా లోకేశ్, కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదేళ్ల కాలంలో గుంటూరు ప్రభుత్వ మహిళా కాలేజీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, కాలేజీకి మహర్దశ తీసుకొచ్చే బాధ్యత తనదేనని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక మహిళా ఇంటర్ కళాశాలలో గ్రౌండ్ లెవలింగ్, ఇంటర్నల్ డ్రెయిన్ల నిర్మాణానికి రూ. 31 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన మహిళా కళాశాలను అభివృద్ధి చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాలకు మహర్దశ తీసుకొచ్చేందుకు సహకారం అందించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, కలెక్టర్ సాయికాంత్ వర్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడమే కాకుండా విద్యారంగంలో ఉన్నతంగా ఎదిగేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో అన్ని విభాగాలను బలోపేతం చేస్తామన్నారు. ప్రపంచ దేశాలు మన వైపు చూడాలంటే విద్య ద్వారానే సాధ్యమని చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం జవాబుదారీతనంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో అధ్యాపకులు నిబద్ధతతో పని చేస్తారని, ఇలాంటి గురువుల మార్గంలో విద్యార్థులు నడిచి కెరీర్ ను మలుచుకోవాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలు పెంచేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గుంటూరు మహిళా కాలేజీలో విద్యనభ్యసించిన విద్యార్థినులు ఎన్నో విజయాలు సాధించారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఇంటర్ లో చేరే టర్మీడియట్‌లో చేరే విద్యార్థినులకు 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.
కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, కూటమి నాయకులు పోతురాజు సమత, కొనకళ్ల సత్యం, చంద్ర, మండవ శ్రీనివాస్, శనక్కాయల రాజకుమారి, టీ పద్మావతి, వలి తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందుల షాపులో రూ.1.45 లక్షల చోరీ కేసు ఛేదన

- ముగ్గురు నిందితుల అరెస్ట్..
- రూ.1.40 లక్షల నగదు స్వాధీనం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** చేబ్రోలు గ్రామంలోని 'జీవీ ట్రేడర్స్' పురుగుల మందుల దుకాణంలో జరిగిన రూ. 1.45 లక్షల నగదు చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి కాట్రగడ్డ ఫణీంద్ర (21), అకరం శెట్టి మణికంఠ (22), సూరిరెడ్డి నివాస్‌రెడ్డి (23)లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 1.40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 13న దుకాణం మూసివేసే సమయంలో కౌంటర్‌లో ఉంచిన నగదును మరుసటి రోజు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ఫణీంద్ర, మణికంఠలు అప్పులు తీర్చుకునేందుకు చోరీకి పథకం వేసినట్లు, అదే దుకాణంలో పనిచేస్తున్న నివాస్‌రెడ్డి నగదు ఉంచే విధానం గురించి వారికి సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. చోరీకి వీలుగా వెనుక తలుపుల గడియలను సడలించి ఉంచి, అర్ధరాత్రి దుకాణంలోకి ప్రవేశించి నగదు అపహరించినట్లు వెల్లడించారు.
గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, తెనాలి డీఎస్పీ బి. జనార్ధనరావు సూచనలతో, పొన్నూరు రూరల్ సీఐ పి. కృష్ణయ్య పర్యవేక్షణలో చేబ్రోలు ఎస్సై పి. వీరనారాయణ సిబ్బంది సహకారంతో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు. ఆగస్టు 25న ముగ్గురినీ అరెస్ట్ చేసి, చోరీకి గురైన నగదులో రూ. 1.40 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. దుకాణాలు మూసివేసే సమయంలో నగదును షాపుల్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు వ్యాపారులకు సూచించారు.

# తయారీ రంగాన్ని ప్రోత్సహించాలి




- సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన తయారీ రంగాన్ని పారిశ్రామికవేత్తలు మరింత ప్రోత్సహించాలని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన 'ఫ్లాగ్‌షిప్ ఎక్స్‌పో--విశాఖపట్నం కర్టెన్ రైజర్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవా రంగంతో పాటు అనేక రంగాల్లో భారత్ గణనీయమైన అభివృద్ధి సాధించినప్పటికీ తయారీ రంగంలో ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో దేశీయ తయారీ రంగానికి పారిశ్రామికవేత్తలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. తయారీ రంగం బలోపేతం ద్వారానే దేశంలో సంపద సృష్టి, ఉపాధి అవకాశాల విస్తరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు కళాశాల స్థాయి నుంచే వస్తు ఉత్పత్తి, తయారీ ప్రక్రియలపై కనీస అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థలు, సాంకేతిక విద్యా సంస్థలతో పరిశ్రమలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 'బిజినెస్ ఎక్స్‌పో' బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు.
ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో సెప్టెంబర్ 11, 12, 13 తేదీల్లో 'బిజినెస్ ఎక్స్‌పో' నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, స్టార్టప్ కంపెనీలతో పాటు వివిధ రంగాలకు సంబంధించిన ప్రత్యేక పెవిలియన్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, స్టార్టప్‌లకు ఈ ఎక్స్‌పో మంచి వేదికగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి రావూరి సుబ్బారావు, బి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# యువతను చైతన్యపరిచే అవగాహన 'డ్రగ్స్ వద్దు బిడ్డా'

- గుంటూరులో ప్రివ్యూ షో ప్రారంభం
- డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు: ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** యువత, విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడంతో పాటు తల్లిదండ్రుల్లోనూ అవగాహన పెంచే లక్ష్యంతో గుంటూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రూపొందించిన "డ్రగ్స్ వద్దు బిడ్డా - ఎ బ్యాటిల్ అగైనెస్ట్ డ్రగ్స్" అవగాహన యాడ్ ఫిలిం ప్రివ్యూ షో ప్రారంభమైంది. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని మైత్రి సినిమా కాంప్లెక్స్‌లో రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ స్విచ్ ఆన్ చేసి ప్రివ్యూ షోను ప్రారంభించారు. రెండు నిమిషాల నిడివితో రూపొందించిన ఈ యాడ్ ఫిలింను సినీ దర్శకుడు దిలీప్ రాజా నేతృత్వంలో తెరకెక్కించారు.
యువత డ్రగ్స్‌కు ఆకర్షితులు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, పిల్లల నడవడిక, అలవాట్లు, స్నేహితుల వివరాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించేలా చేయడమే యాడ్ ఫిలిం ప్రధాన ఉద్దేశమని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సినీ దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి పోలీస్ శాఖ నుంచి పూర్తి సహకారం అందించిన ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ నటుడు నరసింహరాజు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు.
డ్రగ్స్ నియంత్రణకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలు అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. యువత సంక్షేమం, మత్తు పదార్థాల నియంత్రణపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అభినందించారు. అన్ని అనుమతులు పూర్తయిన అనంతరం యాడ్ ఫిలింను సినిమా థియేటర్లతో పాటు సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు ఎస్పీ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, అలవాట్లను గమనిస్తూ వారు డ్రగ్స్‌కు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
గుంటూరు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఇప్పటివరకు గంజాయి వ్యాపారం, సరఫరా, విస్తరణకు పాల్పడుతున్న సుమారు 450 మందిని అరెస్టు చేసి, 141 కిలోల గంజాయి, 4 కిలోల ద్రవ రూప గంజాయి, 5.783 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 28 రౌడీషీట్లు, 582 సస్పెక్ట్ షీట్లు తెరిచామని, పదేపదే గంజాయి వ్యాపారానికి పాల్పడుతున్న తొమ్మిది మందిని పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం కింద నిర్బంధించినట్లు చెప్పారు. "సంకల్పం 325" కార్యక్రమం ద్వారా కళాశాలల్లో 70 వేల మందికి పైగా విద్యార్థులకు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించినట్లు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో పోలీసులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, ప్రజలు భాగస్వాములు కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాసరావు, తెనాలి డీఎస్పీ బి. జనార్దన్ రావు, ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం, సౌత్ డీఎస్పీ పూర్ణచంద్రరావు, నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, నగరంపాలెం సీఐ మునిపల్లి రాజేష్, ఐటీ కోర్ సీఐ నిస్సార్ భాష, ఎస్‌బీ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐలు రాంబాబు, రామచంద్రారెడ్డి, నగరంపాలెం పోలీస్ సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కుటుంబ సమేతంగా మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.
ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గళ్ళా మాధవి దంపతులకు వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు వారికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు.
దర్శనానంతరం గళ్ళా మాధవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కనకదుర్గమ్మను ప్రార్థించినట్లు తెలిపారు. రైతులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని, రాష్ట్ర ప్రజలకు మరింత సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందాలని ఆకాంక్షించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నట్లు పేర్కొన్నారు.

## పంట నమోదు తప్పనిసరి



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్ ):** కాకుమాను మండల పరిధిలోని కే.బి.పాలెం మరియు కొలిమర్ల గ్రామాల్లో మంగళవారం నాడు 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి వి. సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు కీలక సూచనలు, సలహాలు అందజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత పొలం ఉన్న ప్రతి రైతూ విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ (పంట నమోదు) చేయించుకోవాలని స్పష్టం చేశారు. భూమిని కౌలుకు సాగు చేస్తున్న ప్రతి రైతు కౌలు కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు నీటి వసతి తక్కువగా ఉండే ప్రాంతాల్లో మినుము, పెసర వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి పైరును రక్షించుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలని తెలిపారు. దీనివల్ల వరి పైరును 7 నుండి 10 రోజుల పాటు బెట్ట పరిస్థితుల నుండి కాపాడుకోవచ్చని వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా ద్రవ జీవామృతాన్ని ప్రతి పదిహేను రోజులకు ఒకసారి పిచికారి చేయడం ద్వారా కూడా పంటను వర్షాభావ పరిస్థితుల నుండి రక్షించుకోవచ్చని వివరించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కరుణాకర్ , డేవిడ్, అలాగే పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు.

## కాంట్రాక్ట్ మెడికల్, పారా మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



- కాంట్రాక్ట్ మెడికల్, పారా మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మెడికల్, పారా మెడికల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ అలైడ్ మెడికల్ హెల్త్ సైన్సెస్ అండ్ పారా మెడికల్ జేఏసీ ముఖ్య ప్రతినిధులు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో ఆయనను కలిసి ఉద్యోగుల సర్వీస్ సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసుల్లో క్రమబద్ధీకరించే వరకు 100 శాతం గ్రాస్ జీతం చెల్లించాలని, ఉద్యోగులకు రూ. 50 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.
అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈపీఎఫ్ పూర్తి ప్రయోజనాలు కల్పించాలని, వారి సీనియారిటీ, కుటుంబ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లు, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు అవకాశం కల్పించాలని ప్రతినిధులు కోరారు. ఉద్యోగుల సమస్యలను మంత్రి సత్యకుమార్ సానుకూలంగా విన్నారు. సంబంధిత అధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# జూడాల సమ్మె విరమణ... మంత్రి సత్యకుమార్ కృతజ్ఞతలు



- ఏ కష్టం వచ్చినా అండగా నేనున్నా.. మర్చిపోవద్దు : మంత్రి సత్యకుమార్ భరోసా
- జూడాలతో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆత్మీయ భేటీ
- జూనియర్ డాక్టర్ల డిమాండ్లను సానుకూలంగా..సానుభూతితో పరిశీలిస్తాం
- స్టైపెండ్ పెంపుపై ఉన్నత స్థాయి అధికారుల కమిటీ... త్వరలోనే జూడా ప్రతినిధులతో భేటీ
- బోధన వైద్యుల రిటైర్మెంట్ వయసు పెంపుపైనా పునఃపరిశీలన
- నాన్ క్లినికల్ పోస్టుల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ అభ్యర్థుల అంశాన్నీపరిశీలిస్తాం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్ల (జూడా) డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్రవైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిమితులను దృష్టిలో ఉంచుకుని.. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ డాక్టర్లకు అందుతున్న స్టైపెండ్, ఇతర ప్రయోజనాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణల్లో వీరికి అందుతున్న స్టైపెండ్ తదితర అంశాలను రాష్ట్రంలో అమలవుతున్న విధానంతో పోల్చి ఇప్పటికే కూలంకషంగా చర్చించామన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జూడా ముఖ్య ప్రతినిధులు మంత్రి సత్యకుమార్, కార్యదర్శి జి వీరపాండియన్ ను కలిశారు. సమ్మెను విరమించి విధుల్లోనికి వెళ్లడం ప్రారంభించినట్లు ప్రతినిధులు మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సత్య కుమార్ మాట్లాడారు.

జూనియర్ డాక్టర్లు ప్రధానంగా స్టైపెండ్ పెంపుతో పాటు బోధన వైద్యుల రిటైర్మెంట్ వయసు పెంచకూడదని జూడా ప్రతినిధులు ఇంతకుముందు డిమాండ్ చేశారని మంత్రి తెలిపారు. రిటైర్మెంట్ వయసు పెంపు అంశంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వైద్యుల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో ఆ అంశాన్ని కేవలం పరిశీలన మాత్రమే చేశామని చెప్పారు. జూడాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దీనిపై మరోసారి పునఃపరిశీలన చేస్తామని వెల్లడించారు.

**స్టైఫండ్ పెంపు అంశంపై కమిటీ పరిశీలన**

స్టైఫండ్ పెంపు అంశంపై ప్రత్యేకంగా కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్ ఆధ్వర్యంలో కమిటీ పనిచేస్తుందని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో జూడా సంఘాల నాయకులతో కమిటీ సమావేశమై వారి డిమాండ్లపై చర్చిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక పరిమితులు, అందుబాటులో ఉన్న వనరులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

**నాన్ క్లినికల్ పోస్టులపైనా పునఃపరిశీలన**

నాన్ క్లినికల్ విభాగాల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారిని నియమించే అంశంపైనా మరోసారి పునఃపరిశీలన చేస్తామని మంత్రి చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త వైద్య కళాశాలలను త్వరగా ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడిందని, అందులో భాగంగానే నోటిఫికేషన్లు జారీ చేసినట్లు తెలిపారు. వాటికి తగిన స్పందన రాని పరిస్థితుల్లో కొన్ని చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ అంశంపైనా జూడాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునఃపరిశీలిస్తామని స్పష్టం చేశారు.

**సీఎం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం**

జూడాల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వం వారి డిమాండ్ల పట్ల సానుకూలంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ పరిమితులపై జూడా నాయకులకు కూడా అవగాహన ఉందన్నారు. అందువల్ల ఇరువర్గాల మధ్య చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు.

**9,500 మంది వైద్యుల సేవలు కీలకం**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దాదాపు 9,500 మంది జూడాలు సేవలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. పేద, సామాన్య ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడుతున్నారని, ముఖ్యంగా అత్యవసర వైద్య సేవల్లో జూడాల పాత్ర కీలకమని చెప్పారు. సమ్మె కారణంగా అత్యవసర వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జూడాలు మానవతా దృక్పథంతో సమ్మె విరమించడం అభినందనీయమన్నారు.

ప్రజల ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమ్మె విరమించిన జూడా నాయకులకు, డాక్టర్లందరికీ మంత్రి సత్యకుమార్ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ వినతి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాలంకి సుబ్బరాయన్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించింది. పెన్షనర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరింది. రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల కోరిక మేరకు వెంటనే పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేసి ఇంటీరిమ్ రిలీఫ్ (ఐఆర్) ప్రకటించాలని ప్రతినిధి బృందం కోరింది. గత ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ శాతాన్ని గతంలో మాదిరిగా పునరుద్ధరించేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. గత వేతన కమిషన్ సిఫార్సుల అమలుతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయాలని కోరింది. పెన్షనర్లకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల సమయంలో పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పెన్షనర్ సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలంగా పెన్షనర్లు ఎదురుచూస్తున్న సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి. సతీష్ కుమార్, తూము నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. పెన్షనర్ల సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ ప్రతినిధులు కోరారు.

## ఈ నెల 29న వర్ల రామయ్యకు ఆత్మీయ అభినందన సత్కారం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో పదవులు ఉన్నా లేకున్నా నిబద్ధతతో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ప్రతిపక్షంలో పార్టీకి విశేష సేవలందించిన వర్ల రామయ్యను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించిన సందర్భంగా ఈ నెల 29న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మైనర్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మైనర్ బాబు మాట్లాడుతూ వర్ల రామయ్య సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కోపల్లె శ్రీను మాట్లాడుతూ గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఆధ్వర్యంలో 29న ఉదయం 10 గంటలకు నిర్వహించే అభినందన సభకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసన మండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లాలోని ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు హాజరుకానున్నారని తెలిపారు. తెనాలి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మల్లవరపు విజయ్, మొవ్వా డేవిడ్, అన్నవరపు రమేష్, కొమ్మూరి వెంకటేశ్వర్లు, ఎల్ఐసీ రాజు, మద్దు సతీష్, చావలి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలి

- "మిలాద్ ఉన్ నబీ " శుభాకాంక్షలు తెలిపిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సంతోషం, ఆరోగ్యం, సౌభాగ్యం నిండాలని కోరుకుంటూ అందరికీ మిలాద్ ఉన్ నబీ పర్వదిన శుభాకాంక్షలను మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ముస్లిం సమాజంలో ఎంతో పవిత్రంగా భావించే పండుగల్లో మిలాద్ ఉన్ నబీ ఒకటని మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని స్మరించుకుంటూ ఈ రోజును భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. ప్రవక్త మహమ్మద్ జీవితాన్ని, బోధనలను పాటిస్తూ, ఆదర్శంగా నిలవాలని అన్నారు. నిజాయితీ, దయ, క్షమ, ప్రేమ, సహనం, ఇతరులకు సహాయం చేయడం వంటి విలువలకు ప్రవక్త ఇచ్చిన ప్రాధాన్యతను ఆదర్శంగా తీసుకోవాలని కోరుతూ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు మంత్రి ఫరూక్ తెలిపారు.

## ఐక్య ఉద్యమాలకు ఇతర సంఘాల సహకారం కోరిన ఏపీ జేఏసీ అమరావతి

- 28న రాష్ట్రస్థాయి సదస్సుకు ఏపీఎన్జీవో, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులకు ఆహ్వానం



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలకు కలిసి రావాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు పిలుపునిచ్చారు. ఈ నెల 28న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సుకు ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణతో పాటు ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులను వారు ఆహ్వానించారు. మంగళవారం విజయవాడలోని ఏపీఎన్జీవో భవన్‌లో విద్యాసాగర్, రమణలను కలిసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలు, ఇతర దీర్ఘకాలిక సమస్యలపై చర్చించారు. గత రెండేళ్లుగా సమస్యలపై సరైన స్పందన లేకపోవడంతో ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణకు నిర్ణయించిందని, గతంలో మాదిరిగా రెండు జేఏసీలు కలిసి ఉద్యోగుల ప్రయోజనాల కోసం సమైక్యంగా పోరాడాలని కోరారు. కూటమి ప్రభుత్వం గత నెల 22న ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి నెల రోజులు దాటినా నిర్ణయాలు ప్రకటించకపోవడం బాధాకరమని బొప్పరాజు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విద్యాసాగర్ స్పందిస్తూ వచ్చే నెల 3న ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నామని, ఆ సమావేశంలో ఐక్య ఉద్యమాలపై నిర్ణయం తీసుకుని తెలియజేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ అందుబాటులో లేకపోవడంతో ఆయనకు ఫోన్ ద్వారా 28న జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు హాజరు కావాలని, ఉద్యోగుల ఐక్య ఉద్యమాలకు సంఘం తరఫున మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమ కమిటీ అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పారే లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, వీఆర్వో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. అనుపమ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ, క్యాపిటల్ సిటీ అధ్యక్షుడు రవి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మందపాటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ విజయవాడలో ఎన్ఆర్ఐఐటీ విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

- విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, ఆధునిక సాంకేతికతపై ప్రత్యక్ష అవగాహన



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ మూడో, నాలుగో సంవత్సరం చదువుతున్న 60 మంది విద్యార్థులు, ముగ్గురు అధ్యాపకులతో కలిసి విజయవాడలోని ఎన్టీపీసీ థర్మల్ పవర్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. పారిశ్రామిక పర్యటనలో భాగంగా విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు ప్రత్యక్ష అవగాహన పొందారు.

పర్యటనను కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. సంజయ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. టిలక్ బాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి. సీతారామయ్య జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో వ్యవహరిస్తూ పారిశ్రామిక సందర్శన ద్వారా పరిశ్రమల పనితీరు, సాంకేతిక పరిజ్ఞానంపై ప్రాక్టికల్ అవగాహన పెంపొందించుకోవాలని వారు సూచించారు. ఐటీ విభాగాధిపతి బి. సౌజన్య ఆధ్వర్యంలో విద్యార్థులు పర్యటనలో పాల్గొన్నారు.

ఎన్టీపీసీ అధికారులు థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి జరిగే విధానం, బాయిలర్, టర్బైన్, జనరేటర్ వ్యవస్థలు, కంట్రోల్ రూమ్ కార్యకలాపాలు, భద్రతా ప్రమాణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా ప్లాంట్ కార్యకలాపాలను పరిశీలించి, వివిధ అంశాలపై అధికారులను ప్రశ్నించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ఇటువంటి పారిశ్రామిక పర్యటనలు విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు పరిశ్రమల అవసరాలు, పని విధానాలను అర్థం చేసుకునేందుకు ఉపయోగపడతాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. పరిశ్రమ–విద్యాసంస్థల అనుసంధానాన్ని బలోపేతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపింది. ఎన్టీపీసీ విజయవాడ పర్యటన విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి రంగంలోని ఆధునిక సాంకేతికతపై ప్రత్యక్ష అవగాహనతో పాటు భవిష్యత్ కెరీర్‌కు ఉపయోగపడే విలువైన అనుభవాన్ని అందించిందని పేర్కొంది.



## ఎమ్మెల్సీ ఆలపాటి చొరవతో రూ.2.88 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ, ప్రత్యేక సహకారంతో నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) నుంచి మొత్తం రూ. 2,88,036 ఆర్థిక సాయం మంజూరైంది. అన్నం అంజలి వైద్య ఖర్చుల కోసం రూ. 1,53,327, గడ్డం పద్మావతి వైద్య ఖర్చుల కోసం రూ. 1,34,709 మంజూరయ్యాయి. మంజూరైన మొత్తాలకు సంబంధించిన చెక్కులను ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళవారం వారికి అందజేశారు.

ఆపద సమయంలో వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, తమకు అండగా నిలిచి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు బాధితుల కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీకి వారు ధన్యవాదాలు తెలియజేశారు.

## స్పెషల్ టెట్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి - టీఎన్‌యూఎస్

- టెట్ నోటిఫికేషన్ తర్వాత కనీసం మూడు నెలల సమయం ఇవ్వాలి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం స్పెషల్ టెట్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ముందుకు రావడం పట్ల టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. టెట్ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత ఉపాధ్యాయులకు కనీసం మూడు నెలల సమయం ఇవ్వాలని, స్పెషల్ టెట్‌ను ఆన్‌లైన్ విధానానికి బదులుగా ఆఫ్‌లైన్‌లో ఓఎంఆర్ షీట్ ద్వారా నిర్వహించాలని వారు కోరారు. అనేక మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు కంప్యూటర్ పరిజ్ఞానం పరిమితంగా ఉన్నందున ఆన్‌లైన్ పరీక్షలతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ఓఎంఆర్ విధానం అందరికీ సులభంగా, అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.

కేంద్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (సీటెట్)ను సీబీఎస్ఈ ఓఎంఆర్ విధానంలో ఆఫ్‌లైన్‌గా నిర్వహిస్తున్న విషయాన్ని వారు గుర్తుచేశారు. ఉపాధ్యాయుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ టెట్‌లోని రెండు పేపర్లను ఆఫ్‌లైన్ విధానంలో కేవలం రెండు రోజుల్లో నిర్వహించేలా నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను టీఎన్‌యూఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. పరీక్షకు తగినంత సమయం కేటాయించి, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా పరీక్ష నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## రహదారి పనులపై తప్పుడు ప్రచారాన్ని ఖండించిన ఆర్అండ్‌బీ అధికారులు

- ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు చొరవతోనే పనులు ప్రారంభం
- తెనాలి-చందోలు, అంగలకుదురు-నడిగడ్డపాలెం రహదారులపై వాస్తవాలు వెల్లడి



**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి–చందోలు, అంగలకుదురు–నడిగడ్డపాలెం రహదారి నిర్మాణ పనులపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఆర్అండ్‌బీ అధికారులు ఖండించారు. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ప్రత్యేక చొరవ, నిరంతర కృషితోనే ఈ రెండు రహదారుల పనులు ముందుకు సాగుతున్నాయని స్పష్టం చేశారు. మంగళవారం తెనాలి, గుంటూరు, బాపట్ల ప్రాంతాలకు చెందిన ఆర్అండ్‌బీ అధికారులు నిర్వహించిన మీడియా సమావేశంలో రహదారి పనులకు సంబంధించిన వాస్తవాలను వెల్లడించారు.

ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పాత రహదారుల పరిస్థితిని పరిశీలిస్తున్న సమయంలో తెనాలి–చందోలు, అంగలకుదురు–నడిగడ్డపాలెం రహదారుల దుస్థితిని నక్కా ఆనంద్‌బాబు అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులు పూర్తి చేయాలని ఆయన పలుమార్లు అధికారులను కోరినట్లు చెప్పారు. ఈ రెండు రహదారుల్లో కొంత భాగం తెనాలి నియోజకవర్గంలో, మరికొంత భాగం వేమూరు నియోజకవర్గంలో ఉందన్నారు. తెనాలి–చందోలు మార్గంలోని సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ. 2 కోట్లు, అంగలకుదురు–నడిగడ్డపాలెం మార్గంలోని సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ. 2.50 కోట్ల చొప్పున ప్రతిపాదనలు ఉన్నాయని వివరించారు.

గత పదేళ్లుగా ఈ రెండు రహదారి పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. పాత ధరలకు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో జాప్యం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్అండ్‌బీ అధికారులు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబును సంప్రదించగా, ఆయన స్వయంగా కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చొరవ తీసుకున్నారని స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా రహదారుల సమస్యపై ఎమ్మెల్యే పలుమార్లు తమతో మాట్లాడారని, ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు పనులు పూర్తి చేయాలని నిరంతరం అధికారులతో సమన్వయం చేశారని తెలిపారు.

రహదారి పనులు ప్రజలు నిర్వహించిన ధర్నాల కారణంగానే ప్రారంభమయ్యాయన్న ప్రచారం వాస్తవం కాదని అధికారులు స్పష్టం చేశారు. రహదారి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ఉన్నాయని, సుమారు నెల రోజుల క్రితమే పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. పనుల్లో కొంత జాప్యం జరిగినందుకు చింతిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఒక ఛానల్ ప్రతినిధుల ఒత్తిడి కారణంగా మాట్లాడే సమయంలో కొన్ని వ్యాఖ్యలు తప్పుగా దొర్లాయని ఓ ఆర్అండ్‌బీ అధికారి వివరణ ఇచ్చారు. ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు ప్రమేయం లేదని తాను ఎక్కడా చెప్పలేదని, ఆయన చొరవ, కృషితోనే పనులు ప్రారంభమయ్యాయని మరోసారి స్పష్టం చేశారు.

రహదారి పనులపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని అధికారులు తీవ్రంగా ఖండించారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడమే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను కేవలం ప్రతిపాదనలకే పరిమితం కాకుండా, కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితుల్లోనూ ఎమ్మెల్యే స్వయంగా జోక్యం చేసుకుని పనులు ప్రారంభించేలా కృషి చేశారని తెలిపారు. రహదారుల అభివృద్ధి విషయంలో రాజకీయ ప్రచారాలకు తావులేకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అధికారులతో సమన్వయం చేస్తున్నారని అధికారులు స్పష్టం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467